KR TV

మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 | సంచిక 199 | శనివారం 21 జూన్ 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-

# త్వరలో హైదరాబాద్‌లో కొత్త ట్రాఫిక్ రూల్స్..

## డ్రోన్ల ద్వారా ట్రాఫిక్ నియంత్రణ!


2 లో

హైదరాబాద్ నగరంలో త్వరలో కొత్త ట్రాఫిక్ రూల్స్ రాబోతున్నాయి.. దీనికి సంబంధించి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ లో ఒక వైపు వాహనాల వేగం పెరిగింది.. 24 నుంచి 26 కిలోమీటర్లు వాహనాలు హైదరాబాద్ రోడ్ల మీద పరుగులు పెడుతున్నాయని తెలిపారు. వాహనాల యావరేజ్ స్పీడ్ బాగా పెరిగింది, రోడ్లు మాత్రం అంతే ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, హైదరాబాద్ లో 95 లక్షలు వాహనాలు ఉన్నాయి..


2 లో

# బనకచర్లపై చర్చలకు సిద్ధం

●ఏపీతో వివాదాలకోసం కాదు, హక్కుల కోసమే పోరు ●బనకచర్ల ప్రాజెక్ట్‌పై చర్చలకు చంద్రబాబుని ఆహ్వానిస్తాం● బీఆర్ఎస్ బనకచర్లపై పాత జల వివాదాలను రాజకీయం చేస్తోంది ● 2016లోనే బనకచర్ల ప్రాజెక్టుకు బీజం వేశారు - అప్పటి బీఆర్ఎస్ ఎందుకు నిశ్శబ్దం? ●కేసీఆర్, హరీష్ రావు చెప్పే అబద్ధాలకు దేవుడు కూడా ఆశ్చర్యపోతాడు.. నేనేనా వీళ్ళని సృష్టించిందని ..! ●హరీష్ రావు తాటి చెట్టులా పెరిగాడు.. కానీ నాలెడ్జ్ లేదు ●2025 జూన్ 23న బనకచర్లపై ప్రత్యేక కేబినెట్ భేటీ ●తెలంగాణకు అన్యాయం జరిగిందా? నీటి విషయంలో హరీష్ రావే బాధ్యుడు ● బీఆర్ఎస్‌కు బనకచర్ల విషయంలో పాపాల్ని దాచడానికి నాటకాలు ●కిషన్ రెడ్డికి ట్యూషన్ మాస్టర్ కేసీఆర్.. కేటీఆర్‌కు లైజనింగ్ ఆఫీసర్ కిషన్ రెడ్డి: రేవంత్ రెడ్డి

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య హాట్ టాపిక్‌గా మారిన బనకచర్ల ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొరుగు రాష్ట్రం ఏపీతో వివాదాలు కోరుకోవట్లేదని.. కానీ ఎవరి కోసమో మా హక్కులు వదులుకోబోమని తేల్చి చెప్పారు. 2025, జూన్ 23న కేబినెట్ భేటీ నిర్వహించి.. ఇందులో బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చిస్తామన్నారు.

ఆ తర్వాత అవసరమైతే మేమే ఒక అడుగు ముందుకేసి బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ గవర్నమెంట్‌ని చర్చలకు ఆహ్వానిస్తామన్నారు సీఎం రేవంత్. చర్చల ద్వారానే రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒకరోజు కాకుంటే.. నాలుగు రోజులు అయినా కూర్చొని చర్చిద్దామన్నారు. విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల వారీగా డిస్కస్ చేద్దామన్నారు.

పొరుగు రాష్ట్రాతలో తెలంగాణ అనవసరమైన వివాదాలను కోరుకోవడం లేదని.. పైన ఉన్న కర్ణాటకతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లే ఏపీతోనూ మంచి రిలేషన్ కొనసాగించుకోవాలనేది మా విధానమని స్పష్టం చేశారు.

# యోగాకు మతాన్ని ఆపాదించవద్దు: వెంకయ్యనాయుడు


2 లో

యోగా డే సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ రాజకీయ ప్రముఖులతో పాటు భారీగా ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ... ప్రపంచ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే మన లక్ష్యం అని చెప్పారు. యోగా అంతిమ లక్ష్యం మానవత్వం సాధించడం అని అన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల కుట్ర అదే..


2 లో

●ఫోన్ ట్యాపింగ్ కేసు వెనక కాంగ్రెస్-బీఆర్ఎస్ కుట్ర ● కాంగ్రెస్-బీఆర్ఎస్ కలిసి బీజేపీని అడ్డుకోవాలనే కుట్రలో ఉన్నాయ్ ● 420 హామీలు.. ఆరు గ్యారంటీలు.. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కి ప్రజలే తగిన బుద్ధి చెప్తారు ● బీజేపీ కొత్త రక్తంతో సిద్ధం.. ప్రభుత్వంపై పోరుకు శంకుస్థాపన: కిషన్ రెడ్డి

# హనుమకొండ కోర్టుకు బాంబు బెదిరింపు



2 లో

# సన్న వడ్ల బోనస్ బోగస్..?

# 'సన్‌ఫ్లవర్' రైతు గోస పట్టదా?

**- హరీశ్‌రావు**

●సన్న వడ్ల బోనస్ పై సన్నాయి నొక్కులేనా..? బోనస్ విషయంలో కాంగ్రెస్ తీరుపై హరీశ్ రావు ఆగ్రహం ●సన్‌ఫ్లవర్ రైతులకు 75 రోజులు అయినా డబ్బు జమకాలేదు ●యాసంగి సీజన్ ముగిసినా బోనస్ లేదు: రూ.1,161 కోట్లు ఎక్కడ? ●పన్ను వసూలు, మాటలు భారీ.. కానీ రైతులకు డబ్బులివ్వడంలో విఫలం: హరీశ్ రావు


2 లో

సన్న వడ్ల బోనస్ కూడా బోగస్ అయింది.. సన్న వడ్ల బోనస్ పై సన్నాయి నొక్కులేనా.. అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. యాసంగి లో సన్నాల కొనుగోలు పూర్తయినా రూ.1,161 కోట్లు బోనస్ ఇంకా విడుదల చేయకపోవడం దుర్మార్గమని శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. 4.01 లక్షల మంది రైతుల నుంచి 23.22 లక్షల టన్నుల సన్నాలు సేకరించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బోనస్ చెల్లించలేదని ఆరోపించారు.

# కోర్టు తీర్పు తర్వాతే స్థానిక ఎన్నికలు

**: మహేష్ కుమార్ గౌడ్**

## ఇతరుల శాఖల్లో ఎవరూ జోక్యం చేసుకోవద్దు.. మంత్రులకు టీపీసీసీ చీఫ్ చురకలు


2 లో


# సీఎం కుర్చీలో రేవంత్‌ను చూడలేకపోతున్నారు


2 లో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విషయం తక్కువ.. విషం ఎక్కువ అంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కౌంటర్ ఇచ్చారు. హరీష్‌రావుకు కంటెంట్ తక్కువ.. ఆవేశం ఎక్కువ అంటూ సెటైర్లు వేశారు. నీళ్ళు అనే పదంతో బీఆర్ఎస్ రాజకీయం చేసిందని, బీఆర్ఎస్ నేతలు బేసిక్ నాలెడ్జ్ తో ప్రాజెక్టులు కడితే బాగుండేదని ఎద్దేవా చేశారు.

## నేటి మాట

అన్నింటినీ మించిన నేరం అన్యాయంతోనూ, అక్రమంతోనూ రాజీ పడటమే.



- సుభాష్ చంద్రబోస్

# పేదలకు ఇంగ్లీష్ దూరం చేసే కుట్ర

**: అమిత్ షాకు రాహుల్ కౌంటర్**

●పేదలకు ఇంగ్లీష్ నేర్పవద్దన్నది బీజేపీ కుట్ర ● ఇంగ్లీష్ అభివృద్ధికి మార్గం ●ఇంగ్లీష్ పై బీజేపీ దుష్ప్రచారం: పేదల ఎదుగుదలకు అడ్డుగా అంటూ రాహుల్ ఆరోపణ ●ఆర్ఎస్ఎస్ నేతల పిల్లలు విదేశాలకు, పేదల పిల్లలకెందుకు ఆంగ్లం వద్దు?: రాహుల్ గాంధీ


2 లో

# కాంగ్రెస్‌లో ముదిరిన అంతర్యుద్ధం

## కొండా వర్సెస్ ఎమ్మెల్యేల రాజకీయ యుద్ధం

●పార్టీ నేతలపై కొండా మురళి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం ● కొండా దంపతులపై ఎమ్మెల్యేలఫైర్ ●నాయిని ఇంట్లో వరంగల్ ఎమ్మెల్యేలు భేటీ ●పార్టీకి వ్యతిరేకంగా పనులు చేస్తే ఉపేక్షించం- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ హెచ్చరిక ● కొండా సురేఖ 'నల్లికుట్లోడు' వ్యాఖ్యలతో మరోసారి వివాదానికి నిప్పంటిన మాటలు


2 లో

వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో కొండా వర్సెస్ ఎమ్మెల్యేల రాజకీయ యుద్ధం మొదలైంది. కొండా మురళీ వ్యాఖ్యలపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి ఆగ్రహ జ్వాలలతో రగిలిపోతున్నారు. ఈమేరకు శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఇంట్లో వీరంతా భేటీ అయ్యారు.

## సన్న వడ్ల బోనస్ బోగస్..? 'సన్‌ఫ్లవర్' రైతు గోస పట్టదా? హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో పొద్దు తిరుగుడు ( సన్‌ఫ్లవర్) రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. సన్‌ఫ్లవర్ కొనుగోలు పూర్తయి 75 రోజులు దాటినా కూడా రైతుల ఖాతాలో డబ్బులు జమ కాకపోవడం రైతుల పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అద్దం పడుతోందని విమర్శించారు. ఒక సిద్దిపేట జిల్లాలోనే 50 శాతం రైతులకు డబ్బులు ఇవ్వలేదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సన్‌ఫ్లవర్ రైతుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుందని తెలిపారు.

వెంటనే రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న రూ. 1,116 కోట్ల సన్నాల బోనస్ డబ్బులతో పాటు సన్‌ఫ్లవర్ రైతులకు పంట కొనుగోలు డబ్బులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులను గోస పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని, ప్రతీచోట రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు అబద్ధపు హామీలు, గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన మీరు.. పాలన కూడా అదే అబద్ధాలతో నడిపిస్తున్నారని తెలిపారు. అడుగడుగునా ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం బయటపడుతోందన్నారు. పంట పెట్టుబడి సహాయం అందించడంలో వైఫల్యం, పండించిన పంటకు గిట్టుబాటు ధర కేటాయించడంలో వైఫల్యం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో వైఫల్యం, ధాన్యం కొనుగోలు చేయడంలో వైఫల్యం, కొన్న ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో వైఫల్యం చెందిందని పేర్కొన్నారు.

## త్వరలో హైదరాబాద్‌లో కొత్త ట్రాఫిక్ రూల్స్.. డ్రోన్ల ద్వారా ట్రాఫిక్ నియంత్రణ!

మొదటి పేజీ తరువాయి



వంద టౌన్ వెడ్డింగ్ ఏర్పాటు చేశాం.. తోపుడు బండ్లు, ఫుట్ పాత్ ల మీద కబ్జాలు తీసివేయడంతో వాహనాల స్పీడ్ పెరిగింది అని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

ఇక, హైదరాబాద్ నగరంలో ఆపరేషన్ రోప్ ను ఇంకా ముందుకు తీసుకుని పోతామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. అలాగే, సీఎం రేవంత్ రెడ్డి తన కోసం ట్రాఫిక్ ను ఎక్కువ అపవద్దని చెప్పారు.. ఎదురు రూట్ లో ట్రాఫిక్ ను వదిలి పెట్టాలని ముఖ్యమంత్రి చెప్పారని పేర్కొన్నారు.. ఇక, 85 శాతం సిగ్నల్స్ ఆటో మోడ్ లో పని చేస్తుంది.. ట్రాఫిక్ ఉల్లంఘనల సంఖ్య పైనా కాకుండా క్వాలిటీ పైనా దృష్టి పెట్టాలని చెప్పాం.. అలాగే, డ్రోన్ల ద్వారా ట్రాఫిక్ ని కంట్రోల్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.. ఎక్కడైతే ట్రాఫిక్ కు ఇబ్బంది ఉంటదో.. అక్కడ డ్రోన్లను ఉపయోగిస్తామని తేల్చి చెప్పారు.

# బనకచర్లపై చర్చలకు సిద్ధం : సీఎం రేవంత్

బనకచర్ల ప్రాజెక్టు గురించి కేంద్రాన్ని సంప్రదించే ముందు ఏపీ సర్కార్ తెలంగాణ అభిప్రాయాన్ని అడిగి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదన్నారు.

బీఆర్ఎస్ మళ్లీ తెలంగాణ సెంటిమెంటును అడ్డంపెట్టుకుని రాజకీయం చేయాలని చూస్తోందని.. ఇప్పుడు గోదావరి జలాల ఇష్యూని చచ్చిపోయిన బీఆర్ఎస్ సంజీవనిలా వాడుకోవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణకు సాగునీటిలో విషయంలో అన్యాయం చేసిందే కేసీఆర్, హరీష్ రావు అని ఫైర్ అయ్యారు. బనకచర్ల ప్రాజెక్టుకు బీజం పడిందే 2016 బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అని గుర్తు చేశారు.

2016–2018లో బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సర్వే చేయాలని ఏపీ ప్రభుత్వం జీవోలు ఇచ్చిందని.. అప్పుడు తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు అభ్యంతరం చెప్పలేదు..? ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఎందుకు కోర్టులను ఆశ్రయించలేదని ప్రశ్నించారు.

గోదావరి వరద జలాలను ఏపీకి తరలించుకుపోయేందుకు అపెక్స్ కౌన్సిల్లో అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపారని అన్నారు. కేసీఆర్, హరీష్ రావు చెప్పే అబద్ధాలకు దేవుడు కూడా ఆశ్చర్యపోతాడని, నేనేనా వీళ్లను సృష్టించిదని షాక్ అవుతాడని ఎద్దేవా చేశారు. హరీష్ రావు అతి తెలివితో అసహనంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. హరీష్ రావు తాటి చెట్టులా పెరిగాడు గానీ సరియైన నాలెడ్జి లేదన్నారు.

నీటి జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగడానికి ప్రధాన కారకుడు హరీష్ రావు అని ఆరోపించారు. ఇప్పుడు ప్రధాని మోడీకి చంద్రబాబు నాయుడు అవసరం. ఏపీలో మళ్ళీ ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబుకు గోదావరి వరద జలాల అవసరం. అలాగే తెలంగాణలో పార్టీని బతికించుకోవడానికి బీఆర్ఎస్?కు బనకచర్ల ఇష్యూ అవసరం. వీరంతా కలిసి మమ్మల్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు.

కేబినెట్ ఆమోదంతోనే కాళేశ్వరం డిజైన్లు రూపొందించారన్న బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ వ్యాఖ్యలకు తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డికి ట్యూషన్ మాస్టర్ కేసీఆర్.. కేటీఆర్?కు లైజనింగ్ ఆఫీసర్ కిషన్ రెడ్డి అని సీఎం రేవంత్ సెటైర్ వేశారు.

## విద్వేషాలు రెచ్చగొట్టడమే బీజేపీ పని : మంత్రి సీతక్క

దేశంలో పేదలకు భూములు, ఇండ్లు, ఉద్యోగాలు ఇవ్వని బీజేపీ కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. రాష్ట్రంలో గిరిజనులను చెట్టుకు కట్టేసి కొట్టించిన చరిత్ర బీఆర్ఎస్ దని విమర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కుటుంబం దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిందని పేర్కొన్నారు.



గురువారం రాహుల్ గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకొని ములుగులోని గట్టమ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంచర్ల వరకు 2 వేల మంది యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఓ గార్డెన్ లో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మూడుసార్లు ప్రధానిగా అవకాశం వచ్చినా తృణప్రాయంగా వదిలేసి, పేదల కోసం పోరాడుతున్న వ్యక్తి రాహుల్ గాంధీ అని కొనియాడారు.

త్యాగాలు చేసిన నెహ్రూ, ఇందిరాగాంధీ, సోనియాగాంధీలపై బీజేపీ నాయకులు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిరుపేదలకు ఏకకాలంలో 5 లక్షల ఇండ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు చేసిందేమీ లేదన్నారు. కాళేశ్వరం పేరిట చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేయించిన నీచ సంస్కృతి బీఆర్?ఎస్? పార్టీదన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్?విజయానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్? కాంగ్రెస్? రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్? రెడ్డి, స్పోర్ట్స్?అథారిటీ చైర్మన్? శివసేనా రెడ్డి, కాంగ్రెస్? రాష్ట్ర మీడియా ఇన్?చార్జి సామ రామ్మోహన్? రెడ్డి, యూత్? కాంగ్రెస్? రాష్ట్ర కార్యదర్శి సూర్య, రాష్ట్ర ఇన్?చార్జి ఖలీద్?, జిల్లా అధ్యక్షుడు ఇస్సార్?ఖాన్?, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ కోర్టుకు బాంబు బెదిరింపు

హనుమకొండ జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు కాల్ తీవ్ర కలకలం రేపింది. హనుమకొండ అదాలత్‌లోని జిల్లా కోర్టులో బాంబు పెట్టినట్లు శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి డయల్ 100కి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు కోర్టు ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా జల్లెడ పట్టారు. బాంబు కలకలంతో న్యాయవాదులు, లాయర్లు, సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తనిఖీల్లో భాగంగా కోర్టు ఆవరణలో భద్రపరిచిన ఆరు డిటోనేటర్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ డిటోనేటర్లను ఆత్మకూరుకు చెందిన ఓ కేసు విషయంలో గతంలో స్వాధీనం చేసుకున్నవిగా పోలీస్ వర్గాల సమాచారం.

ఈ డిటోనేటర్లకు సంబంధించిన కేసు కూడా గతంలోనే కొట్టి వేసినట్లు పోలీసులు వర్గాల నుంచి సమాచారం. దీంతో తాజాగా బాంబు బెదిరింపు కాల్‌కు ఈ డిటోనేటర్లకు ఎలాంటి సంబంధం లేనట్లు తెలుస్తోంది. బాంబు బెదిరింపు నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకోని.. కాల్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, తనిఖీల్లో భాగంగా మరే ఇతర బాంబు లేదని నిర్ధారణకు రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## కోర్టు తీర్పు తర్వాతే స్థానిక ఎన్నికలు : మహేష్ కుమార్ గౌడ్

రాష్ట్ర మంత్రులకు తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఒకరి శాఖల గురించి మరో మంత్రి మాట్లాడటానికి వీల్లేదని హెచ్చరించారు. స్థానిక ఎన్నికలపై మాట్లాడటం కరెక్ట్ కాదని ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సూచించాను.. పొంగులేటి కూడా దానిపై వివరణ ఇచ్చారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపడం కోసమే అలా మాట్లాడినట్లు తెలిపారు. హైకోర్టు పరిధిలో ఉన్న బీసీ రిజర్వేషన్ అంశంలో న్యాయస్థానం స్పష్టత వచ్చాకే తెలంగాణలో స్థానిక ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. ఇక నుంచి ఎవరూ అలా మాట్లాడటానికి వీల్లేదు.. హద్దులు దాటి మాట్లాడితే చర్యలు తప్పవని మంత్రులకు వార్నింగ్ ఇచ్చారు.

మరోవైపు.. కొండ మురళి వ్యాఖ్యలపైనా మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. ఈ విషయంలో ఇరువర్గాల గురించి ఫిర్యాదులు అందాయని చెప్పారు. అక్కడ నెలకొన్న పరిస్థితులకు సంబంధించి పూర్తిస్థాయి రిపోర్టును అందజేయాలని అబ్జర్వర్లకు సూచించామని చెప్పారు. ఆ రిపోర్టు అందగానే క్రమశిక్షణ చర్యలు తప్పకుండా ఉంటాయని పేర్కొన్నారు. పార్టీలో ఎవరి ఇష్టారీతిన వారు మాట్లాడవద్దని సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నిక విషయంలో పార్టీ అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అజారుద్దీన్ తాను ఎమ్మెల్యే బరిలో ఉన్నట్లు ప్రకటించుకోవడాన్ని తప్పు పట్టలేదు. ఆయన గతంలో అక్కడి నుంచి పోటీ చేశారు కాబట్టి మళ్లీ పోటీకి ప్రయత్నిస్తున్నారు.. ఇందులో తప్పేం లేదని అన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల కుట్ర అదే..

ఫోన్ ట్యాపింగ్ కేసు అత్యంత భయంకరమైనదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. రాజకీయ నాయకులు, హైకోర్టు జడ్జీలు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని ఫైర్ అయ్యారు. చివరికి రాష్ట్ర బీజేపీ కార్యాలయ సిబ్బంది, సోషల్ మీడియా టీమ్ మెంబర్స్ ఫోన్లను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే తమ ప్రభుత్వాన్ని ఎవ్వరూ నమ్మడం లేదంటూ స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని.. ఈ పరిస్థితులకు కాంగ్రెస్ , బీఆర్ఎస్ చేసిన పాపాలే కారణమని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి నాటకాలు ఆడుతున్నాయని.. ప్రజా సంక్షేమంలో దూసుకెళ్తున్న బీజేపీని అడ్డుకునేందుకు ఓ అవగాహనకు వచ్చాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. రెండు పార్టీల నిజ స్వరూపాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల ముందు పెట్టాలన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీయాలని పేర్కొన్నారు. జిల్లాలు, మండలాలతో పాటు గ్రామాల్లో కొత్త కమిటీలను ఏర్పాటు చేసుకున్నామని.. కొత్త రక్తంతో ప్రభుత్వంపై పోరుకు సిద్ధం కావాలని కిషన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలునిచ్చారు.

## సీఎం కుర్చీలో రేవంత్‌ను చూడలేకపోతున్నారు

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం కూలిన తర్వాత తెలంగాణ ప్రజలకు నీళ్లు సంగతి పూర్తిగా అర్థమైంది. కేసీఆర్‌కి ఉన్న అపరజ్ఞానం వల్లే కాళేశ్వరం కూలేశ్వరం అయ్యింది. హరీష్ వైఖరి వల్లే ఏపీ నేతలు బనకచర్లకు నీళ్ళు తరలించుకుందామనే ఆలోచన చేశారు..గోదావరి జలాలపై గొంతు చించుకునే బీఆర్ఎస్ నేతలు.. కృష్ణా జలాలపై ఎందుకు మాట్లాడరు?, హరీష్ రావుకి కంటెంట్ తక్కువ.. ఆవేశం ఎక్కువ. సీఎం కుర్చీలో రేవంత్‌ను బీఆర్ఎస్ నేతలు చూడలేకపోతున్నారు.

నది జలాలు ఎవరి అయ్యా జాగీరు కాదని హరీష్ తెలుసుకోవాలి. నీళ్ళ అంశంపై తనకి తన మామకి తప్పా ఎవరికీ ఏం తెలియదని హరీష్ అనుకుంటున్నారు. తెలంగాణ నీటిని ఏపీకి దారాదత్తం చేసిందే కేసీఆర్. హరీష్ ఇరిగేషన్ మినిష్టర్ గా ఉన్నప్పుడే ఈ పంచాయితీ మొదలైంది. బనకచర్ల విషయంలో కేంద్రం వినకపోతే సుప్రీంకోర్టు మెట్లు ఎక్కుతామని ప్రకటించిన రేవంత్ రెడ్డి కమిట్మెంట్ అర్థం చేసుకోవచ్చు. బనకచర్లపై ఏకగ్రీవ తీర్మాణం చేద్దామని అనుకునే సమయానికి ఆల్ పార్టీ మీటింగ్ నుండి బీఆర్ఎస్ ఎంపీ వాకౌట్ చేసారు. బేస్ వదిలి దోచుకునే ప్రయత్నం చేశారు కాబట్టే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారు. బేసిక్స్ కాదు మాకు ఎథిక్స్ ఉన్నాయి కాబట్టే ప్రజలు మాకు పట్టం కట్టారు' అని ఎంపీ చామల కిరణ్ స్పష్టం చేశారు.

## యోగాకు మతాన్ని ఆపాదించవద్దు: వెంకయ్యనాయుడు



యోగా డే సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ రాజకీయ ప్రముఖులతో పాటు భారీగా ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ... ప్రపంచ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే మన లక్ష్యం అని చెప్పారు. యోగా అంతిమ లక్ష్యం మానవత్వం సాధించడం అని అన్నారు. యోగాకు మతం లేదని, కొంతమంది దానికి మతం ఆపాదించాలని చూస్తున్నారని అన్నారు. యోగా అనేది మన జీవన విధానం అని చెప్పారు. మన పూర్వీకుల నుండి ఇది వచ్చిందని, మన పిల్లకు కూడా దీనిని అందించాలని సూచించారు.

యోగా విషయంలో రాజకీయాలు కూడా చేయవద్దని కోరారు. ఆది యోగి పతంజలి మహర్షి సూత్రాలు సర్వకాలలకు ఆచరణీయం అని చెప్పారు. యోగా అంటే మనస్సు, వృత్తి, ప్రవృత్తులను నిగ్రహించడమే అని ఇది చాలా ముఖ్యమని తెలిపారు. మానసికంగా, శారీరకంగా అనవసరమైనవి వదిలిపెట్టాలని అన్నారు. మన దేశంపై విదేశాలు చేసిన దాడుల నుండి తేరుకుని అభివృద్ధి పథంలో ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ అంటే ప్రపంచమంతా విస్తురుపోతుందని అన్నారు. ఉగ్రవాద స్థావరాలను పక్కవాళ్లకు ఎలాంటి హాని కలిగించకుండా పేల్చివేశారన్నారు. మనకు అలాంటి టెక్నాలజీ అందించిన శాస్త్రవేత్తలతో పాటూ పోరాడిన యోధులను గుర్తుంచుకోవాలన్నారు.

# పేదలకు ఇంగ్లీష్ దూరం చేసే కుట్ర : అమిత్ షాకు రాహుల్ కౌంటర్

ఇంగ్లీష్ మాట్లాడేవారు త్వరలోనే సిగ్గు పడే రోజు వస్తుందని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. అమిత్ షా వ్యాఖ్యలపై శుక్రవారం ఎక్స్ వేదికగా రియాక్ట్ అవుతూ బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్?పై విమర్శలు గుప్పించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ పేద పిల్లలకు ఆంగ్లాన్ని దూరం చేసే కుట్ర చేస్తున్నాయన్నారు. పేద పిల్లలు ఇంగ్లీష్? నేర్చుకోవడం.. ప్రశ్నలు అడగడం, ఉన్నత వర్గాలకు సమానంగా వాళ్లు మారడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలకు ఇష్టం లేదన్నారు.

అందుకే పేద పిల్లలు ఇంగ్లీష్ నేర్చుకోవాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కోరుకోవడం లేదని ఆరోపించారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం సిగ్గు చేటు కాదని.. అది మరింత శక్తి, ప్రోత్సహాన్ని ఇస్తోందన్నారు. ప్రస్తుత ప్రపంచంలో మాతృభాష లాగే ఇంగ్లీష్ నేర్చుకోవడం కూడా చాలా ముఖ్యం.. ఎందుకంటే అది ఉపాధిని కల్పిస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. భారతదేశంలోని ప్రతి భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయి.. మనం వాటిని గౌరవించాలి. కానీ అదే సమయంలో ప్రతి బిడ్డకు ఇంగ్లీష్ నేర్పించాలన్నారు. ప్రపంచంతో పోటీ పడాలంటే ఇంగ్లీష్ అవసరమని నొక్కి చెప్పారు.

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రతిరోజూ ఇంగ్లీషులో మాట్లాడకండి హిందీలో మాట్లాడండని చెబుతారు. కానీ ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతల పిల్లలు ప్రతి ఒక్కరూ చదువుల కోసం విదేశాలకు వెళ్తారు. మరీ ఇదేంటని రాహుల్ ప్రశ్నించారు. పేద పిల్లలు ఎదగకుండా చేయడం కోసమే ఇంగ్లీష్ నేర్చుకోవద్దని చెబుతున్నారని ధ్వజమెత్తారు. ఇంగ్లీష్?తోనే అభివృద్ధి సాధ్యమని రాహుల్ గాంధీ నొక్కి చెప్పారు.

గురువారం మాజీ సివిల్ సర్వెంట్ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహెూత్రి రచించిన 'మెయిన్ బూంద్ స్వయం, ఖుద్ సాగర్ హూన్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడుతూ.. మన భాషలను గౌరవించుకోవాలి. ఈ దేశంలో ఇంగ్లీష్ మాట్లాడేవారు త్వరలో సిగ్గుపడతారు.ం అలాంటి సమాజం ఏర్పడే రోజు దగ్గర్లోనే ఉంది. దృఢ సంకల్పం ఉన్నవారు మాత్రమే సమాజంలో మార్పు తీసుకురాగలరు. మన దేశ భాషలు మన సంస్కృతికి రత్నాలు అని నేను నమ్ముతున్నాను. మన భాషలు లేకుండా మనం నిజమైన భారతీయులుగా ఉండలేమని అన్నారు.

## కవిత మాటల వెనుక కేసీఆర్ ఉన్నాడు..



చేసిన తప్పులను సరిదిద్దుకోవడానికి హరీష్ రావు పోలవరం– బనకచర్ల ప్రాజెక్ట్ పైన మాట్లాడుతున్నాడు అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. హరీష్ రావువి పిచ్చి కూతలు.. తెలంగాణ మీ అయ్య జాగీరా అని కృష్ణా జలాల్లో 299 టీఎంసీలకు ఆ నాడు ఒప్పుకున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ మీ అయ్య జాగీరా అని రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసిఆర్ మాట్లాడాడా..? అని అడిగారు. ఇక, రోజా ఇంట్లో రొయ్యల పులుసు తిని నోటికొచ్చినట్లు మాట్లాడలేదా..? అని క్వశ్చన్ చేశారు. కేసీఆర్ ఆనాడు తెలంగాణ ముఖ్యమంత్రిగా మాట్లాడాడా లేక రాయలసీమ ముఖ్యమంత్రి అనుకున్నాడా..? అని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.

ఇక, వైఎస్ జగన్ తో కేసీఆర్ ఎందుకు స్నేహం చేశాడు.. నాలుగు సార్లు ఎందుకు ప్రగతి భవన్ కు పిలిచాడు? అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు. తెలంగాణ జల వనరులను తాకట్టు పెట్టి ఇప్పుడు నీతి వాక్యాలు చెబుతున్నారు.. బనకచర్ల ప్రాజెక్టు పైన కేసీఆర్ ఎందుకు నోరు విప్పడం లేదు? అని అడిగారు. బేసిన్లు లేవు బేషజాలు లేవని కేసీఆర్ ఆనాడు ఇష్టానుసారంగా మాట్లాడలేదా?.. బనకచర్లకు అవకాశం ఇచ్చిందే కేసీఆర్.. ఆనాడు కళ్లు మూసుకొని కూర్చొన్నాడు అని మండిపడ్డారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం రెండుసార్లు జరిగితే కేసీఆర్ హాజరు కాలేదు.. ప్రాజెక్టుల పేరు మీద బ్యాగులు మోసుకుపోయింది బీఆర్ఎస్ నాయకులే అని ఆరోపించారు. చీప్ క్యారెక్టర్ ఉన్న చీఫ్ మినిస్టర్ కేసీఆర్.. తెలంగాణను దొంగల దొడ్డిగా కల్వకుంట్ల కుటుంబం మార్చిందని పేర్కొన్నారు. ఇక, కవిత మాటల వెనుక కేసీఆరే ఉన్నారు.. వాళ్లది ఫ్యామిలీ డ్రామా అని ఎద్దేవా చేశారు. కవితకు ఎందుకు కేసీఆర్ షోకాజ్ నోటీసులు ఇవ్వలేదు? అని అద్దంకి దయాకర్ ప్రశ్నించారు.

## కాంగ్రెస్‌లో ముదిరిన అంతర్యుద్ధం



కొండా మురళీధర్‌రావు, సురేఖలు తరుచూ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఎమ్మెల్యేల గౌరవాన్ని దెబ్బతీస్తున్నారని, ఈ విషయంపై సీరియస్‌గా స్పందించకపోతే ప్రజల్లోకి, కాంగ్రెస్ క్యాడర్‌లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని చర్చించుకున్నట్లు తెలిసింది. కొండా దంపతులపై పార్టీ కఠిన చర్యలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని డిమాండ్ చేయాలని తీర్మానించుకున్నారు. ఈ విషయంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేస్‌కుమార్ గౌడ్‌కు, సీఎం, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్‌కు లిఖిత పూర్వక వినతిపత్రం అందజేయడంతో పాటు ఏఐసీసీ నేతల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు.

కొండా దంపతులపై పార్టీపరమైన వేటువేయాలని ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నట్లుగా సమాచారం. శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యేల భేటీ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ భేటీలో పాల్గొన్న ఎమ్మెల్యేలకు స్వయంగా ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. మీడియా ఎదుట తొందరపాటుగా ఏం మాట్లాడవద్దని సూచించినట్లు తెలుస్తోంది. పార్టీ అన్ని గమనిస్తూనే ఉంది. అధిష్ఠానం చర్యలకు అందరూ తలొగ్గాల్సి ఉంటుందని చెప్పినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది.

ఇదిలా ఉండగా కొండా దంపతులు పార్టీలో ఉంటే తాము ఉండలేం అంటూ తేల్చిచెప్పినట్లుగా తెలుస్తోంది. అయితే ఇదే అంశంపై హైదరాబాద్లో స్పందించిన పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్.. ఎవరైనా పార్టీ లైన్‌లోన పనిచేయాలని, పార్టీకి విరుద్ధంగా పనిచేస్తే కఠిన చర్యలు తప్పవంటూ కూడా కొండా మురళీ వ్యాఖ్యలను ఉద్దేశించి ఆయన ప్రకటన చేయడం ఇప్పుడు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కొండా మురళీ వ్యాఖ్యలు, ఎమ్మెల్యేల ప్రతి స్పందననేపథ్యంలో పీసీసీ ఆధ్వర్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

ఇప్పుడు పార్టీలో..అధిష్ఠానం వద్ద ఎవరి బలమెంత..! ఎవరు ఎక్కువ.. ఎవరికి ఎక్కువ...ఎవరు తక్కువ..ఎందుకు తక్కువా..? అన్న లెక్కలు తేల్చుకునేందుకు ఎమ్మెల్యేలు సిద్ధమవుతుండటం గమనార్హం. పార్టీకి కొండా దంపతులు కావాలో.. అంకితాభావంతో పార్టీ కోసం కష్టపడుతున్న తాము కావాలో.. తేల్చుకోవాలంటూ నలుగురు ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి సూటిగా స్పష్టంగా తమ వైఖరిని వెల్లడించినట్లుగా తెలుస్తోంది. కొండా దంపుతులతో ఎమ్మెల్యేలకు పెరిగిన గ్యాప్‌ను తగ్గించేందుకు అధిష్ఠానం ఎంత వరకు కృషి చేస్తుంది..? ఎవరి వైపు నిలుస్తుంది..? ఎమ్మెల్యేలను బుజ్జగిస్తూ..కొండా దంపతులకు అండగా నిలుస్తుందా..? ఎమ్మెల్యేల అలకలను.. ఆవేశానికి మద్దతు పలుకుతూ.. కొండా దంపతులపై చర్యలకు దిగుతుందా అన్నది ప్రస్తుతానికి పొలిటికల్ సస్పెన్స్ అనే చెప్పాలి.

ఇదిలా ఉండగా మహేష్‌కుమార్ గౌడ్ హెచ్చరికల తర్వాత కూడా ఓ మీడియా సంస్థతో సురేఖ మాట్లాడుతూ.. కడియం నల్లికుట్లోడు.. నా మంత్రి పదవి పోతుందని ప్రచారం చేస్తున్నాడు.. నాకు అదృష్టం ఉంది కాబట్టే నాకు మంత్రి పదవి వచ్చింది..ఆయనకు అదృష్టం ఉన్నప్పుడు ఆయనకు వచ్చింది.. నాకు మంత్రి పదవి వచ్చిన్నందుకు కడియం తట్టుకోలేకపోతున్నడు..అంటూ ఆరోపణలతో కూడిన విమర్శలను కంటిన్యూ చేయడం చూస్తుంటే మాత్రం కాంగ్రెస్‌లో రేకెత్తిన వర్గపోరు మాత్రం ఇప్పట్లో సమసిపోయేలా లేదని స్పష్టమవుతోంది.

# ప్రైవేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజులు వసూలు చేస్తే నిషేధించాలి

**ఫీజు బకాయిలు ఇవ్వకపోతే ప్రభుత్వంపై తిరుగుబాటే**
**విద్యార్థులకు స్కూటీలు ల్యాప్టాప్ లు ఇంకెప్పుడు ఇస్తారు?**
**-ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్**

మోత్కూర్ 20జూన్ (క్రాంతి న్యూస్):జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలను నిషేధించాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం భయపడుతుందని, ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం ,విద్యాశాఖ వత్తాసు పలుకుతున్నాయని, ప్రభుత్వ గురుకులాలు, బెస్ట్ అవలేబుల్ స్కీమ్ పాఠశాలలు మూతపడుతున్న ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యార్థులు ప్రభుత్వంకి విద్యార్థుల సత్తా ఏంటో చూపిస్తారని, ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తారని, విద్యార్థులకు ఐదు లక్షల భరోసా కార్డు, ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్టాప్ లు ఇంకెప్పుడు ఇస్తారని, ఆర్టీసీలో విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యంగా మోత్కూరు మండల కేంద్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి అక్షరాలతో లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నారని ,ప్రభుత్వం అధిక ఫీజులను నియంత్రించకుండా ప్రైవేట్ విద్యాసంస్థలకు వత్తాసుగా వ్యవహరిస్తుందని, అధిక ఫీజులు వసూలు చేస్తే సీజ్ చేయాలని ఆ దమ్ము ధైర్యం విద్యాశాఖ అధికారులకు లేదని, రాష్ట్ర విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఒక్క రూపాయి ఎక్కువ ఫీజు వసూలు చేస్తే ఆ విద్యాసంస్థను నిషేధించాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆర్టీసీ బస్ పాస్ చార్జీలను పెంచడం సరికాదని విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని, రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభం అయిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగంపై సమీక్ష చేసి ప్రభుత్వ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విద్యారంగం గాడి తప్పిందని ప్రభుత్వ విద్యాసంస్థల్లో సరైన సౌకర్యాలు లేవని, ప్రభుత్వ గురుకులాలకు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు బిల్లులు చెల్లించక ఆ విద్యాసంస్థల ముందు ధర్నాలు చేస్తామని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిల విడుదల పై ఇచ్చిన మాట తప్పుతున్నారని, విద్యార్థులకు ఓట్లు లేకపోతే వారి తల్లిదండ్రులకు ఉన్నాయని వారు అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్ తీసుకున్నారని వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని , అన్ని రకాల బకాయిలను విడుదల చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల చదువులకు నిధులు విడుదల చేయకుండా జాప్యం చేయడం సరికాదని,




అందులో చదివే విద్యార్థులు ఇంటి వద్ద ఉండే పరిస్థితి ఉందని, పాఠశాల కళాశాలలో టీచింగ్ ,నాన్ టీచింగ్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గురుకులాలు మోడల్ స్కూల్లో కేజీబీవీ లలో నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషి చేయాలని, విద్యార్థులు లేరని సాకుతో ప్రభుత్వం 12ఎస్సి గురుకుల ఇంటర్ కళాశాలలను మూసివేసే నిర్ణయాన్ని మార్చుకోవాలని, రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తే ఆ పాఠశాల,కళాశాలల గుర్తింపు రద్దు చేసే విధంగా కఠిన చట్టం తేవాలని, ప్రతి ప్రైవేట్ విద్యాసంస్థ నిబంధనలు పాటించాలని లేని పక్షంలో వెంటనే ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖ పెట్టుకున్న నేపథ్యంలో అన్ని విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఇంజనీరింగ్ కళాశాలలో ఫీజులను ఎట్టి పరిస్థితిలో ప్రభుత్వం పెంచవద్దని బి కేటగిరి సీట్లను లక్షల రూపాయలకు అమ్ముతున్న కళాశాలలను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శేఖర్ రెడ్డి ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వంశి భాస్కర్ మండల కార్యదర్శి రాంపాక చందు అనిల్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ అప్పును మాఫీ చేయాలి

**-జెల్ది రాములు**
**మోత్కూర్ చేనేత సహకార సంఘం అధ్యక్షులు**



మోత్కూర్ 20జూన్ (క్రాంతి న్యూస్): చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ అప్పును మాఫీ చేసి, నూతన క్యాష్ క్రెడిట్ మంజూరు ఇప్పించి చేనేత సహకార సంఘాలను బ్రతికించాలని తెలంగాణ శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి,TSDDC చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి వారి నివాసంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు మోత్కూర్ చేనేత సహకార సంఘం అధ్యక్షులు జెల్ది రాములు పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేనేత సహకార సంఘాలకు ఉన్న క్యాష్ క్రెడిట్ కేవలం 50 కోట్ల రూపాయల లోపు మాత్రమేనని ఈ క్యాష్ క్రెడిట్ అప్పును మాఫీ చేసి నూతన క్యాష్ క్రెడిట్ లు మంజూరు చేస్తే, చేనేత సహకార సంఘాలు మరల పునర్ వైభవం చెందుతాయని అన్నారు. టెస్కో ను పునరుద్ధరించి చేనేత సహకార సంఘాల ద్వారా బట్టలు కొనుగోలు చేస్తే , చేనేత కార్మికులకు పని కల్పించటమే కాక ఉపాధి అవకాశం దొరుకుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో చేనేత రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహ, సిరిపురం చేనేత సహకార సంఘం అధ్యక్షులు అప్పం రామేశ్వరం, చౌటుప్పల్ చేనేత సంఘం అధ్యక్షులు కందగట్ల బిక్షపతి, నకిరేకల్ చేనేత సంఘం అధ్యక్షులు చిలుకూరి లక్ష్మి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు



గార్ల,20 జూన్ (క్రాంతి న్యూస్ ): మహబూబాబాద్ జిల్లా పరిధిలోని గార్ల మండల కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహం సందర్శించి బాలికల వసతి గృహంలో తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల గురించి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి.కవిత ని కలిసి అడిగి తెలుసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి.కవిత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినీలకు వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలియజేసి వసతి గృహంలో గార్ల మండల పరిధిలోని గ్రామాలకు చెందిన ఎస్సీ,ఎస్టీ,బిసి మైనారిటీ,ఎస్సీ, వర్గాలకు చెందిన బాలికలకు అడ్మిషన్ ఇప్పించాలని వారికి కరపత్రాలు అందజేయడం జరిగింది.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ అమృతం పంపిణీ...!!

**ఎంఈఓ కోడెపాక రఘుపతి**
**సూపర్వైజర్ జయప్రద**



చిట్యాల ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల నాలుగవ కేంద్రంలో మరియు జూకల్ గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో కూడిన పల్లి పట్టి ఇందిరమ్మ ప్రోగ్రామ్ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి హాజరయ్యారు అనంతరం అంగన్వాడి సూపర్వైజర్ జయప్రద మాట్లాడుతూ 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల బాల బాలికలకు రక్తహీనత పోషకాహార లోపాన్ని తగ్గించుటకు రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి మరియు జిల్లా కలెక్టర్ డీ డబ్ల్యూ ఓ మల్లీశ్వరి ఆదేశానుసారం చిరుధాన్యాలతో కూడిన పల్లి పట్టిని బాలికలందరికీ నెలకు రెండు ప్యాకెట్లు చొప్పున మొత్తం 30 పీసులు రోజు ఒకటి చొప్పున తినాలని రేపటి కిషోర్ బాలికల వలె రేపటి స్త్రీ మాతృమూర్తులని ఈ దశ నుండే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ పిల్లలు చదువులు క్రీడారంగం రానున్న ముందు రోజుల్లో ఒక మంచి ఉద్యోగంలో కానీ ఎందులోనైనా రాణించాలి అంటే ఆరోగ్యమే మహాభాగ్యం కాబట్టి ఈ చిన్న వయసు నుండి ఆహార విషయంలో నాకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు అనంతరం పిల్లల బరువు ఎత్తు చూసి ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎంల ద్వారా రక్త పరీక్షలు చేయించారు ఈ కార్యక్రమంలో జూకల్ ఇన్చార్జి హెచ్ఎం రాధిక టీచర్ నీలిమ సునీత మమత స్వరూప ఉమాదేవి రూప శ్రీ ఆశా వర్కర్లు చిట్యాల జూకల్ అంగన్వాడీ టీచర్స్ ఏఎన్ఎం సుమలత జయలత తదితరులు పాల్గొన్నారు.

## నేడు గిరిజన భవనంలో దశాబ్ది అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

**ప్రజలందరూ పాల్గొని విజయ వంతం చేయాలి**
**జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్**



ములుగు జిల్లా ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): గిరిజన భవనంలో దశాబ్ది అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలకు ప్రజలందరూ పాల్గొని విజయ వంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మరియు ఆయుష్ డిపార్ట్మెంట్ జిల్లా కేంద్రంలో జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఉదయం ఏడు గంటలకు జరగనున్నాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకలు గిరిజన భవనం ములుగులో జరుగుచున్నాయి. ఈ యొక్క అంతర్జాతీయ యోగా దినోత్సవం లో అధికారులు, ప్రజలు మరియు మీడియా ప్రతినిధులు భాగస్వాములు కావాలని , ప్రతిరోజు యోగా చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు సామూహికంగా యోగ ప్రాణాయామ మరియు మెడిటేషన్ కార్యక్రమాలు జరుగుతాయి. ఈ కార్యక్రమం ఆర్గనైజర్లు జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ (ఆయుష్) డాక్టర్ ఎన్ లీ చంద్ర, జిల్లా ఇన్చార్జ్ డాక్టర్ సంధ్య, యోగ ఇన్స్ట్రక్టర్స్ శివకృష్ణ ,హరిత, మానస పాల్గొననున్నారు.

## సీనియర్ పాత్రికేయులు కొలిపాక మనోహర్ రెడ్డి ని ఘనంగా సన్మానించిన సీనియర్ పాత్రికేయులు కోల లక్ష్మణ్ కాసం హరిప్రసాద్



రామగుండం ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): రామగుండం అంతర్గాం మండల సీనియర్ పాత్రికేయులు కొలిపాక మనోహర్ రెడ్డి ని. అయన గురువులు తోటి పాత్రికేయులు శుక్రవారం షాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు కోల లక్ష్మణ్. కాసం హరిప్రసాద్ లు మాట్లాడుతూ. నాలుగు రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఐ జె యు అనుబంధ టియుడబ్ల్యూజే యూనియన్ ఎన్నికలలో జిల్లా కార్యవర్గ సభ్యులుగా మనోహర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావటం మా అందరికి గర్వకారణమని. భవిష్యత్తులో మరెన్నో పదవులు అలంకరించాలని. ఈ నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షులు మళ్ళావజుల వంశీతో పాటు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నమ్మన్నారు. జర్నలిస్టులు ఎదురుకుంటున్న సమస్యలను గుర్తిస్తూ. జిల్లా కార్యవర్గ దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెలుతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు అరుముల్ల కనకపాల్.ఎల్కపెల్లి సాయి. కందుగుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో 80 లక్షల మోసపూరిత లింక్‌లను బ్లాక్ చేసిన ఎయిర్‌టెల్..




ఏపీ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): ఆధునిక డిజిటల్ ప్రపంచంలో ఆన్‌లైన్ మోసాలు ప్రతీ రోజు ఏదో ఒక చోటు జరుగుతూనే ఉన్నాయి. అత్యధికంగా డిజిటల్ అక్షరాస్యత పెరుగుతున్న ఆంధ్రప్రదేశ్‌లో.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆన్‌లైన్ మోసగాళ్ల ముప్పు నానాటికీ పెరుగుతోంది. ఫిషింగ్ లింక్‌లు, నకిలీ ప్యాకేజీ డెలివరీ మెసేజ్‌లు, ఫేక్ బ్యాంకింగ్ హెచ్చరికలు వంటి పద్ధతులతో సైబర్ నేరగాళ్లు అమాయక వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ సవాలును ఎదుర్కొనేందుకు.. భారతీ ఎయిర్‌టెల్ సంస్థ తమ వినియోగదారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అత్యాధునిక వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఈ వ్యవస్థ ద్వారా కేవలం 36 రోజుల్లోనే ఆంధ్రప్రదేశ్‌లోని 80 లక్షలకు పైగా (8.0 మిలియన్లు) వినియోగదారులను ఆన్‌లైన్ మోసాల బారి నుండి రక్షించినట్లు ఎయిర్‌టెల్ ప్రకటించింది.

ఆధునిక సాంకేతికతతో రక్షణ..

ఎయిర్‌టెల్ ప్రారంభించిన ఈ అధునాతన వ్యవస్థ కృత్రిమ మేధస్సు (ఏఐ ) టెక్నాలజీతో పనిచేస్తుంది. ఇది వినియోగదారులకు చేరే మెసేజ్‌లను, లింకులను రియల్ టైమ్‌లో విశ్లేషిస్తుంది. ఉదాహరణకు.. విజయవాడలోని ఒక ఎయిర్ టెల్ యూజర్‌కు "మీ ప్యాకేజీ ఆలస్యం అయింది. దాన్ని ఇక్కడ ట్రాక్ చేయండి.. http://www.tracky0urparcell.com" వంటి అనుమానాస్పద సందేశం వస్తే .. ఎయిర్‌టెల్ వ్యవస్థ వెంటనే అప్రమత్తమవుతుంది. ఇది ఆ లింక్‌ను తక్షణమే స్కాన్ చేసి, ఏదైనా మోసపూరిత కార్యకలాపాలను గుర్తించినట్లయితే.. దానికి సంబంధించిన యాక్సెస్‌ను వెంటనే నిరోధిస్తుంది. దీనివల్ల వినియోగదారులు తెలియకుండానే హానికరమైన వెబ్‌సైట్‌లకు వెళ్ళకుండా.. తమ వ్యక్తిగత సమాచారాన్ని కోల్పోకుండా రక్షించబడతారు.

ఆన్‌లైన్ మోసాల నుంచి ..

భారతీ ఎయిర్‌టెల్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఈఓ అజయ్ అనంతపద్మనాభన్ ఈ విజయంపై మాట్లాడుతూ.. తమ వినియోగదారులను ఆన్‌లైన్ మోసాల నుంచి కాపాడటం తమకు అత్యంత ప్రాధాన్యమన్నారు. ఈ అత్యాధునిక భద్రతా పరిష్కారాన్ని వినియోగదారులకు ఉచితంగా అందిస్తున్నామని.. ఏపీలో తమ సామర్థ్యాలను మెరుగుపరచడానికి.. వినియోగదారుల అత్యవసర అవసరాలను తీర్చడానికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా.. అజయ్ అనంతపద్మనాభన్.. ఆంధ్రప్రదేశ్ ఐజీ , 'ఈగల్' చీఫ్ ఆకే రవికృష్ణను కలవడం.. ప్రైవేటు సంస్థలు , చట్ట అమలు సంస్థల మధ్య సమన్వయాన్ని సూచిస్తుంది.

ఎయిర్‌టెల్‌కు సంబంధించి ఈ సైబర్ రక్షణ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఒక డిజిటల్ షీల్డ్‌గా పనిచేస్తుంది. కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, గృహిణులు, విద్యార్థులు.. మొదటిసారి స్మార్ట్‌ఫోన్ వినియోగదారులతో సహా అన్ని వర్గాల ప్రజలను ఇది సురక్షితంగా ఉంచుతుంది. ఈ ఏఐ -ఆధారిత రక్షణ వ్యవస్థ ప్రజలకు సురక్షితమైన ఆన్‌లైన్ వాతావరణాన్ని కల్పించడంలో ఎంతగానో దోహదపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# అన్నదాత సుఖీభవ పథకం.. స్టేటస్ ఇలా చెక్ చేస్కోండి,



ఏపీ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు ఆర్థికంగా సహాయం చేయడానికి అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయబోతోంది. ఈ పథకం కింద డబ్బులు పొందడానికి రైతులు ఈ నెల 20వ తేదీలోగా ఈకేవైసీ పూర్తి చేయాలని తొలుత చెప్పారు. అయితే సాంకేతిక సమస్యలు, గడువు దగ్గర పడుతుండటంతో రైతులు ఆందోళన చెందారు. కానీ ప్రభుత్వం నిబంధనలను సడలించడంతో రైతుకు ఊరట దక్కింది. ప్రభుత్వం రైతులందరూ ఈకేవైసీ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం వద్ద వివరాలు లేని కేవలం 1.45 లక్షల మంది రైతులు మాత్రమే ఈ కేవైసీ చేసుకోవాలని తెలిపింది. ఈ లిస్టుల్ని రైతు సేవా కేంద్రాలకు(ఆర్‌ఎస్‌కే) పంపించారు. దీంతో అర్హుల గుర్తింపు ఈజీ అయ్యింది. వివరాలు లేనివారు మాత్రమే బయోమెట్రిక్ నమోదు చేసుకోవాలని ప్రభుత్వం తెలిపింది. దీంతో అధికారులు ఈకేవైసీ జాబితాలను అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన అర్హులతో అనుసంధానించారు..ఈ మేరకు 97 శాతం వరకు ఈకేవైసీ పూర్తయింది అంటున్నారు.

అన్నదాత సుఖీభ పథకానికి తాము అర్హులమో కాదోనని చాలా మంది రైతులు కంగారు పడ్డారు. అందుకే ప్రభుత్వం చెక్ స్టేటస్ అనే ఆప్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని కోసం రైతులు ప్రభుత్వ వెబ్‌సైట్ https://annadathasukhibhava.ap.gov.in/లోకి వెళ్లి.. చెక్ స్టేటస్ ఆప్షన్ క్లిక్ చేయాలి. రైతు తన ఆధార్ నంబర్ నమోదు చేసి.. పక్కనే ఉండా కాప్చాను ఎంటర్ చేసి సెర్చ్ ఆప్షన్ క్లిక్ చేస్తే అర్హుల వివరాలు కనిపిస్తాయి. అంతేకాదు ఆ రైతు ఈకేవైసీ చేసుకోవాల్సిన అవసరం ఉందో, లేదో కూడా తెలుస్తుంది అంటున్నారు. ఒకవేళ అనర్హులుగా తేలితే రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం దరఖాస్తు చేసుకునేందుకు మరోసారి అవకాశం కల్పిస్తుంది అంటున్నారు. వ్యవసాయ శాఖ వెబ్‌ల్యాండ్ ద్వారా అర్హుల జాబితాను తయారు చేసింది. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా కుటుంబం యూనిట్‌గా అర్హులను గుర్తించారు. ఆరు అంచెల వెరిఫికేషన్‌ను పూర్తి చేశారు.. ప్రజాప్రతినిధులతో పాటుగా ఐటీ చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యవసాయేతర పనులకు భూమిని ఉపయోగించే వారిని అనర్హులుగా గుర్తించారు అధికారులు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ ద్వారా ఏటా రూ.20 వేల చొప్పున సాయం అందించనుంది. ఈ రూ.20వేలల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.14 వేలు, కేంద్రం రూ.6 వేలు ఇస్తుంది. ఈ రూ.20వేలను మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. పీఎం కిసాన్ కింద రూ.2 వేలు, అన్నదాత సుఖీభవ కింద రూ.5 వేలు కలిపి రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. అర్హత ఉంటే చాలు ప్రతి ఒక్క రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద డబ్బులు అకౌంట్‌లలో జమ చేస్తామని ప్రభుత్వం తెలిపింది.

# ఏపీకి దిగ్గజ ఐటీ కంపెనీ.. ఆ ప్రాంతానికి మహర్దశ.. 99 పైసలకే 21 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం?




ఏపీ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): ఆంధ్రప్రదేశ్‌లో దిగ్గజ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ తమ క్యాంపస్ ఏర్పాటు చేస్తోంది. ఇందుకు కావాల్సిన భూమిని నామమాత్రపు ధరతోనే కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖపట్నంలో రూ. 1,500 కోట్లతో క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి కాగ్నిజెంట్ కంపెనీకి ఏపీ ప్రభుత్వం భూమిని కేటాయించినట్లు తెలుస్తోంది. ఈ పెట్టుబడి ద్వారా ఎనిమిదేళ్లలో 8,000 ఉద్యోగాలు వస్తాయని అంచనా. కాగ్నిజెంట్ 2029 మార్చి నాటికి కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుందట. విశాఖపట్నం ఐటీ హబ్‌గా ఎదుగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం.


కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కేవలం 99 పైసలకే భూమిని పొందినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. విశాఖపట్నంలో రూ. 1,582 కోట్ల ఐటీ క్యాంపస్‌ను నిర్మించనుంది. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (%ఎవీ=ణూ%) పరిధిలోని 'కాపులుప్పాడ'లో 21.31 ఎకరాల భూమిని కాగ్నిజెంట్ కోరగా.. ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రపు ధరకే కేటాయించినట్లు సమాచారం.

విశాఖపట్నాన్ని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షిస్తున్నారు. ఇందులో భాగంగానే కాగ్నిజెంట్‌ను విశాఖకు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. కాగ్నిజెంట్ 2029 మార్చి నాటికి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ సమాచార సాంకేతిక, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ కొద్ది రోజుల క్రితం రాష్ట్రంలో కాగ్నిజెంట్ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. త్వరలోనే దీనిపై ప్రకటన చేస్తుందని చెప్పారు. ఆ విషయంలో మరింత పురోగతి సాధించినట్లు తాజాగా వెల్లడవుతోంది.

ప్రపంచ ఆర్థిక వేదిక (%ఔజుఖీ%) కోసం దావోస్‌లో జరిగిన సమావేశంలో నారా లోకేష్ కాగ్నిజెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్ రవి కుమార్‌ను కలిసి విశాఖపట్నం వంటి టైర్-2 నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. 'కగ్నిజెంట్ కాపులుప్పాడలో 21.31 ఎకరాల భూమిని విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (%ఎవీ=ణూ%) కింద కోరింది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం 99 పైసల నామమాత్రపు రేటుకు భూమిని కేటాయిస్తుంది.' అని ఒక అధికారి పేర్కొన్నారు.

విశాఖపట్నం ఐటీ హబ్‌గా మారుతోంది. దేశీయ అతిపెద్ద ఐటీ కంపెనీ టీసీఎస్‌కు విషయంలో ఆంధ్రప్రదేశ్ కేబినెట్ ఇటీవల సంచలన నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నంలో టీసీఎస్ ఏర్పాటు కోసం ఏకంగా 21.16 ఎకరాల భూమిని కేవలం 99 పైసలకే కేటాయించేందుకు నిర్ణయించింది. సంవత్సరానికి కేవలం 99 పైసల లీజు ఉంటుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. గుజరాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టాటా మోటార్స్‌కు 99 పైసలకే భూమి కేటాయించిన విధానాన్నే ఏపీ సర్కార్ అనుసరించినట్లు తెలుస్తోంది.

# ఏపీ నాయకుల పనితీరు భేష్.. ప్రధాని ప్రశంసలు..



విశాఖపట్నం ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పనితీరుపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూసేలా చేశారుగా అంటూ ప్రభుత్వ పెద్దలను అభినందించారు. జూన్ 21న యోగా దే సందర్భంగా విశాఖపట్నంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 5 లక్షల మందికి పైగా జనాలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ సైతం పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన శుక్రవారం సాయంత్రమే విశాఖకు చేరుకున్నారు. భువనేశ్వర్‌లో బహిరంగ సభ అనంతరం.. నేరుగా విశాఖకు చేరుకున్నారు ప్రధాని.

ఈ సందర్భంగా ప్రధాని మోదీకి గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎంపీ భరత్‌లు స్వాగతం పలికారు ఈ సందర్భంగా యోగాంధ్ర నిర్వహణ ఏర్పాట్లపై ప్రధాని కాసేపు మాట్లాడారు. ప్రపంచం మొత్తం ఏపీ వైపు చేసేలా చేశారుగా అంటూ సీఎం చంద్రబాబుకు కితాబిచ్చారు ప్రధాని. యోగాంధ్ర ద్వారా సరికొత్త రికార్డ్ సృష్టిస్తున్నామని ప్రధానితో సీఎం చంద్రబాబు చెప్పారు. యోగాంధ్ర ఏర్పాట్ల గురించి తెలుసుకున్న ప్రధాని.. ఏపీ నాయకుల పనితీరు భేష్ అంటూ ప్రశంసించారు.

# జగన్ అబద్ధపు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు: దేవినేని



అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీడియాలో మాట్లాడిన మాటలు తన అసహనాన్ని, అభద్రతాభావాన్ని తెలియజేస్తున్నాయని తెలుగుదేశం సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకుంటే సంవత్సరం తర్వాత జగన్ రెడ్డి పరామర్శకు వెళ్లడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తెనాలిలో గంజాయి బ్యాచ్‌తో, పొదిలిలో అరాచక శక్తులతో జగన్ అల్లర్లు సృష్టించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అరాచక ర్యాలీ, పైశాచిక ప్రవర్తనతో ఇద్దరు చనిపోయారు వారిని ఎందుకు జగన్ రెడ్డి పరామర్శించలేదని దేవినేని ఉమామహేశ్వర రావు ప్రశ్నించారు. నరుకుతాం.. చంపుతాం.. తొక్కిపడేస్తాం.. అని జనాల్ని బెదిరిస్తారా ? 'ప్రజలకు ఏం సందేశం ఇద్దామని అని ప్రశ్నించారు. 82 కేసులున్న తాము వారానికి నాలుగు రోజులు కోర్టులకు వెళు _న్నామని తెలిపారు. సీబీఐ, ఈడీలో ముద్దాయిగా ఉండి, బాబాయ్ హత్య కేసులో నీ చుట్టుపక్కన ఉన్న కుటుంబ సభ్యులందరూ భాగస్వాములై ఉండి రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తున్నావని మండిపడ్డారు. సంవత్సర కాలంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి జగన్ రెడ్డి ఓర్వలేక, తట్టుకోలేక పోతున్నారని ధ్వజమెత్తారు దేవినేని ఉమామహేశ్వర రావు.జగన్ హయాంలోని ఐదేళ్లలో గంజాయి, డ్రగ్స్, నాసిరకమైన మద్యం, హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులు, సోషల్ మీడియాలో బూతులు, స్త్రీలపై దాడులు వంటివి చేసి, ఒక తరం భవిష్యత్ పొట్టన పెట్టుకున్నారని దేవినేని ఉమామహేశ్వర రావు మండిపడ్డారు. ర్యాలీలో వాహనం ఢీకొని ఒకరు, తోపులాటలో ఇంకొకరు చనిపోతే కనీసం పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. తల్లికి వందనంపై మొన్నటి వరకు ఎగతాళిగా మాట్లాడిన జగన్ డబ్బులు పడిన తర్వాత మానసిక పరిస్థితిలో ఇబ్బంది కొట్టొచ్చినట్లు కనపడిందని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు 18 గంటలు కష్టపడుతూ ఏపీని సర్వతోముఖాభివృద్ధి చేస్తుంటే తన వయసు గురించి జగన్, వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు దేవినేని ఉమామహేశ్వర రావు.కులాల ప్రస్తావన తీసుకొచ్చి మళ్లీ పబ్బం గడుపుకోవాలని జగన్ చూస్తున్నారని దేవినేని ఉమామహేశ్వర రావు మండిపడ్డారు. సిద్ధం సభల్లో నీ అరాచకాలను చూసే జనం నిన్ను 11 సీట్లకు పరిమితం చేశారని.. అయినా ఆయనకు సిగ్గు రావడం లేదని విమర్శలు చేశారు. జగన్‌పై ఉన్న కేసులన్నీ బట్టబయలు అవుతున్నాయని.. డిశ్చార్జ్ పిటిషన్ వేసుకుంటూ కోర్టు మెట్లు ఎక్కకుండా డ్రామాలాడుతున్నారని అన్నారు. ఆయన అబద్ధపు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు.. జగన్ ఎన్ని నాటకాలు ఆడినా, డ్రామాలు వేసినా ప్రజలు పట్టించుకోరని దేవినేని ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు.

# ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి రెండు కోట్లతో సిసి రోడ్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

రామగుండం ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి 3,4,5, వ డివిజన్లకు చెందిన ప్రజల కోరిక మేరకు ఎన్ టి పి సి పట్టణంలో 3,4,5, డివిజన్లకు చెందిన రోడ్డు అభివృద్ధి కార్యక్రమాలకు మున్సిపల్ అధికారులు స్థానిక కౌన్సిలర్లు మరియు నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేసిన రామగుండం శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్ ఎన్ టి పి సి పట్టణంలోని మున్సిపల్ పరిధిలో నరసాలపల్లి మల్కాపూర్ జంగాలపల్లి బి.టైప్ కాలనీ ఎస్ బి ఐ బ్యాంక్ నుండి నర్రశాలపల్లి వరకు ప్రధాన రహదారి (కలెక్టర్ అవైలబుల్ ఫండ్) నుండి 2 కోట్ల రూపాయల నిధులతో 20 మీటర్లతో ఒక కిలోమీటర్ సి.సి రోడ్లు నిర్మాణం కోసం పలు అభివృద్ధి పనులకు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు రామగుండం నియోజవర్గ శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ 900 కోట్ల రూపాయలతో కొత్త విద్యుత్ కేంద్రంలో ఏర్పాటుకు ప్రత్యేక చొరవ రామగుండం నియోజవర్గ శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుమారు 900 కోట్ల రూపాయలతో నిధులతో రోడ్లు డ్రైనేజీలు తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పనుల వేగవంతంగా నిర్వహిస్తున్నామని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు ఎన్నికల్లో గెలిచిన కొద్ది కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు పొందుతూ పనులు చేపట్టామని అన్నారు అదేవిధంగా సింగరేణి మేడిపల్లి ఓసిపి వద్ద 500 మెగావాట్ల పంప్ హౌస్ స్టోరీస్ తో జల విద్యుత్ జరిపే యూనిట్ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు వీటితోపాటు రామగుండం ధర్మల్ కేంద్రంలో 1౭800 మెగావట్ల యూనిట్ ఏర్పాటును మీ అందరి సహకారంతో కృషి చేస్తున్నారని



అన్నారు కొత్త విద్యుత్ యూనిట్లు ఏర్పాటు జరిగితే స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు గత 30 సంవత్సరాల నుండి 3,4,5, వా డివిజన్లకు చెందిన ప్రజలకు విద్యార్థులకు ఉద్యోగస్తులకు రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల నానారకాలుగా ఇబ్బంది పడ్డారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీను ఈరోజు నన్ను నమ్ముకొని ఓటు వేసి గెలిపించిన తర్వాత నరసపల్లి,మల్కాపూర్, జంగాలపల్లి బి టైప్ కాలనీ ఎస్బిఐ బ్యాంక్ నుండి నర్రా శాలపల్లి వరకు ప్రధాన రహదారి కోసం రెండు కోట్లతో సీసీ రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మరియు ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దుల శ్రీధర్ బాబు సంబంధిత మంత్రివర్యుల సహకారంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు నిరుపేద కుటుంబాలకు బడుగు బలహీన వర్గాలకు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తా ఉంది ప్రతి ఒక్కరు కూడా దయచేసి జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించి తెలంగాణ రాష్ట్రంలోనే రామగుండం నియోజకవర్గం మొదటి స్థానంలో పెట్టాలని ప్రయత్నం చేస్తూ ముందుకు వెళ్తా ఉన్నా నాకు సహకరించండి నన్ను ఆశీర్వదించండి అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆసిఫ్ పాషా మున్సిపల్ సంబంధిత అధికారులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు పలు వార్డుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంటు వ్యాధుల నిరోధానికి పారిశుధ్య చర్యలు తీసుకోవాలి

## సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు డిమాండ్



భద్రాద్రి కొత్తగూడెం 20 జూన్ (క్రాంతి న్యూస్ ): రానున్న వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు కోరారు. ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడం వల్ల పట్టణ పారిశుధ్యం నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించిన ఆయన, యుద్ధ ప్రాతిపదికన పరిసరాల శుభ్రతపై అధికారులు దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే, వార్డుల్లోని కాలువలు చెత్తతో నిండిపోవడం, చెత్తకుప్పల చుట్టూ దోమలు, క్రిమికీటకాలు పెరిగిపోవడం వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అధికారులను విస్తృతంగా పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా: వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి కాలువల్లో మురికి నీరు నిలవకుండా చూడాలి దోమల నివారణకు మందుల పిచికారి చేయాలి బ్లీచింగ్ పౌడర్ చల్లి పాకింగ్ మిషన్లతో పొగ పీల్చాలి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో పురపాలక అధికారులు చొరవ చూపాలని మునిగడప వెంకటేశ్వర్లు కోరారు.

# పోక్సో చట్టంపై అవగాహన

## షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు చైతన్యం



భద్రాద్రి కొత్తగూడెం,20 జూన్ (క్రాంతి న్యూస్ ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు అధికారి ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కొత్తగూడెం ఎమ్ జె పి టి బి సి డబ్ల్యు ఆర్ ఎస్ బాయ్స్ స్కూల్ నందు విద్యార్థులకు పోక్సో చట్టం, షీ టీమ్స్ విధులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, డ్రగ్స్ ముప్పు, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్ ఐ రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి. ముఖ్యంగా బాలబాలికల, మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాల గురించి తెలుసుకోవాలి. పిల్లల నడవడికలో మార్పులు గమనించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. పోక్సో యాక్ట్ కింద నేరస్తులకు కఠిన శిక్షలు ఉంటాయి. బాధితులకు చట్టం అండగా ఉంటుంది" అని వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం అని ఆమె హెచ్చరించారు. "వాట్సాప్ లింకులు, మెయిల్ లింకులు ఓపెన్ చేయవద్దు. వ్యక్తిగత, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పవద్దు. మానవ తప్పిదమే సైబర్ నేరాలకు దారి తీస్తోంది" అన్నారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్లను బ్లాక్ చేయాలని, ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ 1930 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. డ్రగ్స్ ముప్పు పై కూడ చైతన్యం అవసరమని, విద్యార్థుల ప్రవర్తనపై ప్రతిరోజూ పర్యవేక్షణ అవసరం ఉందని పేర్కొన్నారు. "డ్రగ్ రహిత భద్రాద్రి జిల్లా" కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు, బాలికలు ఎదుర్కొనే వేధింపులపై స్పందించేందుకు షీ టీం సదా సిద్ధంగా ఉందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, అలాగే ఏదైనా సమాచారం కోసం షీ టీం వాట్సాప్ నంబర్ 87126 82131 కు సమాచారాన్ని పంపించాలని తెలిపారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ ప్రిన్సిపల్ ఫిరోజ్ సుల్తానా, షీ టీం ఎ ఎస్ ఐ నాగయ్య, పి సి రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# 'సంవిధాన్ బచావో ప్రోగ్రామ్' రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఆత్రం సుగుణక్క



కొమరం భీం ఆసిఫాబాద్ ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): కాంగ్రెస్ పార్టీ 'సంవిధాన్ బచావో ప్రోగ్రామ్' రాష్ట్ర కమిటీ చైర్మన్ పి.వినయ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు...ఈ సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్,'సంవిధాన్ బచావో ప్రోగ్రామ్' రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆత్రం సుగుణక్కతో పాటు పలువురు సభ్యులు, అన్ని జిల్లాల పరిశీలకులు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా చేపడుతున్న 'సంవిధాన్ బచావో ప్రోగ్రామ్' ని ప్రజల్లోకి ఎలా తీసుకు వెళ్ళాలి,తదితర విషయాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు.ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగం పరిరక్షణ కోసం 'జై బాపు', 'జై భీమ్', 'జై సంవిధాన్ అభియాన్' కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా చేపట్టాలని తీర్మానించారు.

# రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ కుటుంబానికి కోటి రూపాయల చెక్కు అందజేత




భద్రాద్రి కొత్తగూడెం , 20 జూన్ (క్రాంతి న్యూస్ ): ఇటీవలి రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతిచెందిన పోలీస్ కానిస్టేబుల్ టీ. అనిల్ కుమార్ కుటుంబానికి ఆర్థిక సాయం నిమిత్తం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి "యూనిఫామ్డ్ సర్వీస్ కస్టమర్ వెల్ఫేర్ స్కీం" ద్వారా మంజూరైన రూ.1 కోటి విలువైన చెక్కును, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపిఎస్ ఈరోజు వారి కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ ఎం. సత్యనారాయణ, చీఫ్ మేనేజర్ ఆంజనేయ రమేష్, బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వీరి సమక్షంలో ఎస్పీ చెక్కును అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, దేశం కోసం సేవలందిస్తున్న పోలీసు సిబ్బంది మరియు వారి కుటుంబాలకు అండగా నిలిచేలా ఈ స్కీం ఎంతో ప్రయోజనకరంగా ఉంది. వీటివల్ల మన సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక భద్రత కలుగుతుంది"అన్నారు. ఇంకా, ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు మరియు సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష

భద్రాద్రి కొత్తగూడెం ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): సింగరేణి సంస్థ కార్పొరేట్ కార్యాలయంలోని జిఎం (పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ చాంబర్‌లో జూన్ 20, 2025 (శుక్రవారం) నాడు, శనివారం జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో జి.వి. కిరణ్ కుమార్ గ, జిఎం (పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్, వివిధ విభాగాల అధికారులతో పర్సనల్, సివిల్, ఎస్అండ్‌పిసి, ఎలక్ట్రికల్, ఫైనాన్స్, మెడికల్ విభాగాలతో అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,జూన్ 21, 2025న



ఉదయం 7:00 గంటల నుండి 7:45 గంటల వరకు కార్పొరేట్ కార్యాలయంలో యోగా కార్యక్రమం నిర్వహించనున్నాం. ఇందులో అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, స్కౌట్స్ సభ్యులు పాల్గొంటారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు విభాగాల వారీగా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేయాలి" అని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో డిజిఎంలు కె. నారాయణ రావు, బి. శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, వై.వి.ఎల్. వర ప్రసాద్, పి. వేణు గోపాల రావు, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి. శ్రీనివాస రావు, డి.వై.ఎస్.ఇ (ఈ &ఎం): ఏ. నరేష్, ఏ.ఇ (సివిల్): బి. క్రాంతి, మెడికల్ సూపరింటెండెంట్ కృష్ణ మూర్తి, ఎస్అండ్‌పి జూనియర్ ఇన్ స్పెక్టర్ డి. నారాయణ రెడ్డి తదితరులు పాల్గొనారు.

# సీఎం రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో ముగిసిన విచారణ.. తీర్పు వాయిదా



హైదరాబాద్ ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): గచ్చిబౌలిలో 2016లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును కొట్టివేయాలంటూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. గోపన్‌పల్లిలో సర్వే నం.127లోని 31 ఎకరాలకు సంబంధించి హక్కుల వివాదంలో ఎస్సీ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి, రేవంత్‌రెడ్డి సోదరుడు ఎ.కొండల్‌రెడ్డి, ఎ.లక్ష్మయ్యల మధ్య వివాదం కొనసాగుతోంది. అప్పట్లో ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతో సొసైటీకి చెందిన స్థలంలోకి అక్రమంగా చొరబడ్డారని, అడ్డుకున్న తనపై కులం పేరుతో దూషించారంటూ సొసైటీ తరఫున ఎన్.పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. దీన్ని కొట్టివేయాలని కోరుతూ రేవంత్‌రెడ్డి 2020లో పిటిషన్ దాఖలు చేశారు. ఘటనా స్థలంలో లేకున్నా రేవంత్‌రెడ్డిపై రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ప్రభుత్వం కేసు నమోదు చేసిందని ఆయన తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. పెద్దిరాజు 2014లోనే చందానగర్‌లో రేవంత్‌పై ఫిర్యాదు చేశారని, సరైన ఆధారాలు లేకపోవడంతో కోర్టు ఆ కేసు కొట్టివేసిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు కోర్టుకు తెలిపారు. 2016లో మళ్లీ గచ్చిబౌలి పీఎస్‌లో పెద్దిరాజు ఫిర్యాదు చేశారని, 8 మంది సాక్షుల వాంగ్మూలంలోనూ రేవంత్‌రెడ్డి ఘటనా స్థలంలో లేరని చెప్పారని తెలిపారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

ఆరోగ్య క్రాంతి
epaper.krtvnews.com



# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..

హెల్త్ న్యూస్ ,20 జూన్ (క్రాంతి న్యూస్ ) : యోగా ప్రాముఖ్యతను గుర్తించిన విదేశీయులు దేశానికి వచ్చి యోగ్యాభ్యాసం చేస్తున్నారు. రాష్ట్రంలోని హైదరాబాద్‌తో పటు వివిద ప్రాంతాల్లో వెలిసిన యోగా కేంద్రాలకు ప్రత్యేకంగా వచ్చి పరిపూర్ణతను సాధిస్తున్నారు. శరీరంలోని జీవక్రియలను క్రమబద్ధీకరించడంతో పాటు వేలాది రూపాయలు వెచించి ఇంగ్లీష్ మందులు వాడినా తొలగని ఎన్నో రోగాలకు యోగా నిపుణులు పరిష్కారం చూపుతున్నారు. రక్తపోటు, మదుమేహం, క్యాన్సర్ వంటి రోగాలకు యోగాసనాలు, ఆహారపు అలవాట్ల మార్పుతో నయంకావడానికి ప్రత్యక్ష అనుభంలోకి తీసుకువస్తుండటంతో అమితాసక్తి కనబరుస్తున్నారు. ప్రాణాయామం, ద్యానం, పంచాక్షరి, మంత్రపఠవం యోగాలో ఒక భాగమే. యోగాతో చక్కటి శరీర సోష్టాన్ని కూడా సొంతం చేసుకునే అవకాశం ఉంది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ధ్యానం అభ్యసించి, పూర్తి ఏకాగ్రతను సాధించే అవకాశం ఉంటుంది. తద్వారా విజయాన్ని గుప్పిటపట్టవచ్చు.



అన్ని రకాల బావోద్వేగాలను ఒడిసిపట్టి సమర్థవంతమైన నాయకుడిగా ఎదిగేందుకు కూడా పలు రకాల యోగా ప్రక్రీయలు ఉపయోగపడుతాయని యోగా నిపుణులు వివరిస్తున్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించేందుకు వేలాది రూపాయలు వెచించి పరికరాలను కొనుగోలు చేయాల్సిన అవసరంలేదు. భారీగా శరీరాకృతికి శ్రమపడాల్సిన పని అంతకన్నా లేదు. పూర్తి ఆసక్తి ఓపికగా అభ్యాసంచేస్తే చాలు. బాల్యదశ నుంచి వృద్ధుల వరకు ఎవరైనా యోగాతో ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. యోగాకు ఉన్న విస్తృత ప్రయోజనాల దృష్ట్యా ప్రతి ఒక్కరు ఆచరించేలా అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. యోగాసనాలకు సంబంధించిన వివరాలు తెలుసుకుందాం.

## అష్టాంగ యోగా..

యోగాలో అష్టాంగ స్థితులను క్రమ పద్దతిలో ఆచరిస్తే సత్ఫలితాలు సాధ్యమని యోగా గురువులు సెలవిస్తున్నారు. అవి.

**యమం:** అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహం, కల్గినదే యమ యోగా. సాధకుడు అనుసరించవల్సిన మొదటి మెట్టుగా దీనిని చెప్పుకోవచ్చు.

**నియమం:** శౌచము, సంతోషము, తపస్సు, స్వాద్యాయ ఈశ్వర ప్రణిదానము ఇది రెండో మెట్టు యోగా సాదనకుడు మొదట తన మనస్సును అదుపులో పెట్టుకోవాలని అర్థం అంటే యమ నియమలను పాటించాలి.

**ఆసన:** ఇది శారీరక క్రియ దీనిలో ఆసనాలు అభ్యసనం చేయాలి. నిల్చోని, కూర్చుని, వెల్లకిలా పడుకుని, బోర్లా పడుకుని ఇలా వంద రకాల స్థితులున్నాయి. నిత్యం అభ్యసనం చేయడానికి కొన్ని ఆసనాలను కలిపి, సూర్య నమస్కారాలు అనే క్రియ తయారైంది.

**ప్రాణాయమం:** ఇది శ్వాసక్రియకు సంబంధించిన ఉచ్ఛ్వాస, నిశ్వాసల ప్రక్రీయ మన శ్వాసను నియంత్రిచండం ద్వారా శరీరాన్ని అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నించడమే ఈ ప్రాణా వ్యాయామం ఉదేశ్యం. ఇదికూడా అనేక తాత్కాలిక రోగాలకు విరుగుడుగా పనిచేస్తుంది.

**ప్రత్యాహార:** ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవడం. ఆరోగ్యంగా ఉన్న మానవుడి ఇంద్రియాలను అదుపులో పెట్టుకోగలడు. ఇది ఆష్టాంగ యోగా పద్దతుల ద్వారా సులభం. ఇది ఐదో మెట్టు.

**దారణ:** మనస్సును స్థిరపరచడం, ఇంద్రియాలను అదుపులో పెట్టుకున్నవారికి మనస్సును ఒకే విషయంపై కేంద్రీకరించడానికి సిద్ధమవుతుంది.

**సమాది:** పై ఏడు స్థితుల్లో ఆరితేరిన యోగా సాధకుడికి ఎనిమిదవ స్థితి సాధ్యమవుతుంది. ఇది యోగా సాధనలో చివరిదశ, ఈ స్థితిలో మనిషిలోని జ్ఞానచక్షువు తెరుచుకుంటుంది. దీనినే నిశ్చలస్థితి అని, నిర్వీరాకరస్థితి అని అంటారు.



## ఆసనాల ఉపయోగాలు..

ఆరోగ్యానికే కాదు అనారోగ్య బాధలు తొలిగిపోవడానికి యోగా దీటైన సాధనమని యోగా సాధకులు సూచిస్తున్నారు.

**పాద హస్తవనం:** కాలేయం పనితీరు మెరుగుపడుతుంది. మదుమేహ పీడితులు తప్పక వేయాల్సిన ఆసనమిది. అజీర్ణం వ్యాదులు నయమవుతాయి.

**త్రికోణాసనం:** నాజుగ్గా ఉండాలనుకునే నవతరం అమ్మాయిలకు ఇష్టమైన ఆసనమిది. పిరుదుతు, నడుములోని కొవ్వు తగ్గిపోతుంది. మదుమేహం, శ్వాసకోశ వ్యాదులు మూత్ర సంబంధం జబ్బులు నయమవుతాయి.

**మకరాసనం:** మెడనొప్పితో బాధపడేవారు వేయదగిన ఆసనమిది. మానసిక ఒత్తిడిలో సతమతమయ్యే వృత్తుల్లో ఉన్నవారికి వరంలాంటిది. పూర్తిగా విశ్రాంతినిస్తుంది.

**పవన ముక్తాసనం:** దీనికి పొట్టవస్తుందని బాధపడేవారు రోజు ఈ అవకాశాన్ని సాధన చేస్తే సమస్య ఉండదు. అదే విధంగా జీర్ణక్రియ సామర్థ్యం పెరుగుతుంది. మలబద్ధకం సమస్య మటుమాలయం.

**భుజంగా ఆసనం:** ప్రధానంగా వెన్నునొప్పులు తగ్గుతాయి. వీపు నిటారుగా అవుతుంది. మెడ కండరాలు బలపడుతాయి. వెన్నునొప్పి సమస్యతో బాధపడేవారు తరుచుగా ఈ అవకాశాన్ని సాధన చేయడం వల్ల నరాలు బలోపేతం అవుతాయి. వెన్నుముక బలపడుతుంది.

**మత్స్యాసనం:** శరీరం మనసూ తేలిక పడుతాయి. శ్వాసకోశ వ్యాదులు ఆస్తమా దూరమవుతాయి.

**శీర్షాసనం:** ఆసనాల్లో రారాజు, వెంట్రుకలు, తెల్లబడకుండా, రాలిపోకుండా కాపాడుతుంది. కళ్లు, ముక్కు, చెవులకు ఆరోగ్యంగా ఉంచుతుంది. బుద్దిని వికసింపజేస్తుంది.

**సర్వాంగాసనం:** శరీర అవయవాల పనితీరు మెరుగుపడుతుంది. స్త్రీలలో ఋతుసంబంధ సమస్యలు తగ్గుతాయి. థైరాయిడ్ తదితర జబ్బులపైన ప్రభావం చూపుతుంది.

## యోగాతో శారీరక మానసిక మార్పులు..

శరీరం ఉల్లాసంగా ఉంటుంది.

మానసిక ఒత్తిడి తొలిగిపోతుంది.

పగ, ద్వేషం, అసూయ తగ్గిపోతాయి.

నిర్ణయం సామర్థ్యం పెరుగుతుంది.

నేర్చుకునే శక్తి పెరుగుతుంది.


రక్తంలో గ్లూకోజు తగ్గుముఖం పడుతుంది.


శరీరంలోని సోడియం తగ్గిపోతుంది.

చెడు కొలెస్ట్రాల్ తగ్గుముఖం పడుతుంది.

లింపోసైట్ కౌంట్ పెరుగుతుంది.

మెదడులో ప్రాణవాయువు వృద్ధి చెందుతుంది.





# క్రీడలు





## గిల్‌కు మద్దతివ్వాలి: సచిన్



స్పోర్ట్స్ న్యూస్ ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్‌కు మెరుగైన అవకాశాలున్నాయని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ వ్యాఖ్యానించాడు. ఇంగ్లండ్ దిగ్గజ బౌలర్ జేమ్స్ అండర్సన్‌తో కలిసి గురువారం ట్రోఫీని ఆవిష్కరించిన సచిన్ సిరీస్‌పై పలు కీలక విషయాలు పంచుకున్నాడు. 'భారత క్రికెట్ ప్రస్తుతం పరివర్తన దశలో ఉంది. తీసుకునే నిర్ణయాలపై దృష్టి పెడుతూ బయట జరుగుతున్న విషయాలను కొత్త కెప్టెన్ గిల్ మరిచిపోవాలి. భారత కెప్టెన్‌గా తీవ్ర ఒత్తిడి ఉంటుంది.

వీటన్నింటిని తట్టుకుంటూ ముందుకు సాగాలి. ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు వ్యూహాలు రచించాలే తప్ప..డ్రెస్సింగ్ రూమ్ బయట జరుగుతున్న వాటని పట్టించుకోకూడదు. కెప్టెన్‌గా నిరూపించుకునేందుకు గిల్‌కు సమయం ఇవ్వడంతో పాటు అందరూ మద్దతు ఇవ్వాలి. జట్టు ప్రయోజనాలకు అనుగుణంగా కెప్టెన్ నిర్ణయాలు ఉండాలి. అంతేగానీ ఎవరు పడితే వారు చెప్పినట్లు వింటే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది' అని అన్నాడు.

## ఫైనల్లో ఐదు టీమ్‌లు..
## ఆసియాకప్ ఆర్చరీ టోర్నీ



స్పోర్ట్స్ న్యూస్ ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): ఆసియాకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నీలో భారత యువ ఆర్చర్ల పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. గురువారం ఐదు వేర్వేరు టీమ్ విభాగాల్లో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ కనీసం రజత పతకాలు ఖాయం చేసుకున్నారు. రెండో సీడ్ భారత పురుషుల రికర్వ్ టీమ్ ఏకపక్షంగా సాగిన సెమీస్‌లో 5-1తో బంగ్లాదేశ్‌ను ఓడించి ఫైనల్లోకి ప్రవేశించింది. విష్ణుచౌదరి, పారాస్ హుడా, జుయల్ సర్కార్‌తో కూడిన భారత త్రయం..బంగ్లాపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ సెమీస్‌లో వైష్ణవి పవార్, విష్ణు చౌదరి ద్వయం 5-3తో సింగపూర్‌కు చెందిన తబిత లిన్‌యో, యు లాంగ్ జోడీపై గెలిచింది. హెూరాహెూరీగా సాగిన పురుషుల కాంపౌండ్ టీమ్ సెమీస్‌లో భారత త్రయం కుశాల్ దలాల్, గణేశ్ తిరుమూరు, మిహిర్ అపార్ 30-29(షూటౌట్)లో ఆస్ట్రేలియాపై గెలిచి తుదిపోరులో నిలిచారు. మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్ సెమీస్‌లో షణ్ముకి , తేజాల్, తనిష్క 230-229తో కజకిస్థాన్‌ను ఓడించింది.

## నైట్‌రైడర్స్ హెడ్ కోచ్‌గా
## సీఎస్‌కే దిగ్గజం



స్పోర్ట్స్ న్యూస్ ,20 జూన్ (క్రాంతి న్యూస్ ): త్వరలో ప్రారంభం కానున్న కరీబియన్ ప్రీమియర్ లీగ్ 2025 సీజన్ కోసం ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్ ఐపీఎల్ ఫైవ్ టైమ్ ఛాంపియన్ సీఎస్‌కేకు చెందిన దిగ్గజ ఆటగాడు డ్వేన్ బ్రావోను హెడ్ కోచ్‌గా నియమించుకుంది. ఈ మేరకు నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీ జూన్ 20 న అధికారిక ప్రకటన విడుదల చేసింది. గత సీజన్ వరకు నైట్‌రైడర్స్‌కు హెడ్ కోచ్‌గా ఫిల్ సిమన్స్ ఉండేవాడు. సిమన్స్ బంగ్లాదేశ్ జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తుండటంతో ఈ పదవి నుంచి తప్పుకున్నాడు.

నైట్‌రైడర్స్ హెడ్ కోచ్‌గా ఎంపిక కావడంపై బ్రావో హర్షం వ్యక్తం చేశాడు. నా హృదయానికి చాలా దగ్గరగా ఉన్న ఈ ఫ్రాంచైజీకి హెడ్ కోచ్‌గా పని చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నానని అన్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా సిమన్స్ ఈ ఫ్రాంచైజీని అద్భుతంగా ముందుండి నడిపించినందుకు కృతజ్ఞతలు తెలిపాడు. నైట్‌రైడర్స్ హెడ్ కోచ్‌గా కొత్త సవాళ్లు స్వీకరించేందుకు సిద్ధమని అన్నాడు.

బ్రావో కోచింగ్ కెరీర్‌పై ఓ లుక్కేద్దాం..

2022లో ఐపీఎల్ నుంచి రిటైరైన బ్రావో.. కోచ్‌గా తన ప్రయాణాన్ని సీఎస్‌కేతోనే మొదలుపెట్టాడు. 2023 సీజన్‌లో అతను సీఎస్‌కే బౌలింగ్ కన్సల్టెంట్‌గా పని చేశాడు. ఆతర్వాత 2024 సీజన్‌లో ఇంటర్నేషనల్ లీగ్ టీ20లో అబుదాబి నైట్‌రైడర్స్‌కు హెడ్ కోచ్‌గా వ్యవహరించాడు.

2025 ఐపీఎల్ సీజన్‌కు ముందు కేకేఆర్ మెంటార్‌గా కొత్త బాధ్యతలు చేపట్టాడు. ఈ మధ్యలో బ్రావో ఆఫ్ఘనిస్తాన్ జాతీయ జట్టుకు బౌలింగ్ కన్సల్టెంట్‌గా పని చేశాడు. అతని ఆధ్వర్యంలో ఆ జట్టు 2024 టీ20 వరల్డ్‌కప్‌లో సెమీస్ వరకు చేరి చరిత్ర సృష్టించింది. ఆఫ్ఘనిస్తాన్ సాధించిన ఈ ఘనతలో బ్రావో పాత్ర చాలా కీలకంగా ఉండింది.

పొట్టి క్రికెట్‌లో దిగ్గజ ఆల్‌రౌండర్ అయిన బ్రావోకు స్వదేశంలో జరిగే కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లోనూ ఘనమైన ట్రాక్ రికార్డు ఉంది. ఈ లీగ్‌లో బ్రావో 107 మ్యాచ్‌ల్లో 129 వికెట్లు తీసి నేటికీ లీడింగ్ వికెట్ టేకర్‌గా కొనసాగుతున్నాడు.

## భారత్ నుంచి ఒక్క ప్లేయరే..
## ఆ జట్టుతోనే జెమీమా! లిస్ట్ ఇదే..

స్పోర్ట్స్ న్యూస్ ,20 జూన్ (క్రాంతి న్యూస్ ):భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యురాలు జెమీమా రోడ్రిగ్స్‌ను మహిళల బిగ్ బాష్ లీగ్ ఫ్రాంచైజీ బ్రిస్బేన్ హీట్ తిరిగి తీసుకుంది. ఈ ఏడాది జరగనున్న డబ్ల్యూబీబీఎల్ 10వ సీజన్ కోసం భారత్ నుంచి 15 మంది ప్లేయర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు ఒక్క జెమీమా మాత్రమే తిరిగి బీబీఎల్‌లో ఆడటం ఖరారైంది.



కాగా గురువారం జరిగిన ప్లేయర్ల డ్రాఫ్టింగ్‌లో లీగ్‌లోని మొత్తం 8 ఫ్రాంచైజీలు 23 మంది అంతర్జాతీయ ప్లేయర్లను ఎంపిక చేసుకున్నాయి. జెమీమా రోడ్రిగ్స్‌తో పాటు చినెల్లి హెన్రీ (వెస్టిండీస్), డి క్లెర్క్ (దక్షిణాఫ్రికా)ను బ్రిస్బేన్ ఫ్రాంచైజీ ఎంపిక చేసుకుంది.

'అభిమానులను ఆకట్టుకోగల సత్తా జెమీమాకు ఉంది' అని బ్రిస్బేన్ హీట్ యాజమాన్యం వ్యాఖ్యానించింది. జెమీమాకిది నాలుగో బిగ్‌బాష్ లీగ్ సీజన్ కానుంది. 2021-2022 సీజన్‌లో మెల్‌బోర్న్ రెనెగెడ్స్ తరఫున... 2022- 2023 సీజన్‌లో మెల్‌బోర్న్ స్టార్స్ తరఫున... 2024-2025 సీజన్‌లో బ్రిస్బేన్ హీట్ తరఫున జెమీమా ఆడింది. ఓవరాల్‌గా బిగ్‌బాష్ లీగ్‌లో జెమీమా 30 మ్యాచ్‌లు ఆడి 644 పరుగులు చేసింది. ఇందులో మూడు అర్ధ సెంచరీలున్నాయి.

మరోవైపు.. శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు, షబ్నమ్ ఇస్మాయిల్ (దక్షిణాఫ్రికా), హీథర్ నైట్ (ఇంగ్లండ్)ను సిడ్నీ థండర్ జట్టు తీసుకుంది. సోఫియా డంక్లీ, మ్యాడీ విలియర్స్ (ఇంగ్లండ్), అమేలియా కెర్ (న్యూజిలాండ్)ను సిడ్నీ సిక్సర్స్ జట్టు తీసుకుంది.

సోఫీ ఎకిల్‌స్టోన్, టామీ బ్యూమాంట్ (ఇంగ్లండ్) , లౌరా వాల్వర్డ్ (దక్షిణాఫ్రికా)ను అడిలైడ్ స్ట్రయికర్స్ ఎంపిక చేసుకోగా... అమీ జోన్స్, డానీ గిబ్సన్ (ఇంగ్లండ్), మరిజాన్ కాప్ (దక్షిణాఫ్రికా)ను మెల్‌బోర్న్ స్టార్స్ జట్టు ఎంపిక చేసుకుంది. సోఫీ డివైన్ (న్యూజిలాండ్), స్మోల్‌ఫీల్డ్ (ఇంగ్లండ్), ఛ్లో ట్రియాన్ (దక్షిణాఫ్రికా) పెర్ స్కోచెర్స్ జట్టుకు ఎంపికయ్యారు.

ఇక డానియల్ వ్యాట్, లినెస్సీ స్మిత్ హెూబర్ట్ హరికేన్స్‌కు ప్రాతినిధ్యం వహించనుండగా... మెల్‌బోర్న్ రెనెగెడ్స్ తరఫున డియాండ్రా డాటిన్, అలీస్ కాప్సీ బరిలోకి దిగనున్నారు.

KR TV క్రాంతి
శనివారం 21 జూన్ 2025

# సినిమా న్యూస్

epaper.krtvnews.com

## 'ప్రతీ సెకను శ్రమిస్తున్నా'..: 'వార్ 2'పై దర్శకుడు కీలక వ్యాఖ్యలు



బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ , ఎన్టీఆర్ కీలక పాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'వార్ 2' . యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా కోసం సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలోనే చిత్ర దర్శకుడు అయాన్ ముఖర్జీ ఈ ప్రాజెక్ట్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్ట్ విషయంలో తనపై ఎంతో బరువు బాధ్యతలు ఉన్నాయని చెప్పారు. ప్రేక్షకుల అంచనాలను దృష్టిలో ఉంచుకుని తాను వర్క్ చేస్తున్నానని అన్నారు.

"వార్' చిత్రానికి ఎంతోమంది అభిమానులు ఉన్నారు. ఈ చిత్రానికి కొనసాగింపుగా వస్తోన్న చిత్రం కావడంతో 'వార్ 2' విషయంలో నాపై ఎంతో బాధ్యత ఉంది. ఇది నాకు దొరికిన గొప్ప అవకాశంగా భావిస్తున్నా. ఇలాంటి భారీ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు ఆనందిస్తున్నా. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోలతో కలిసి వర్క్ చేస్తుండటంతో స్టోరీ లైన్ విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నా. యాక్షన్ పార్ట్స్, హృతిక్ రోషన్-ఎన్టీఆర్‌ల మధ్య ఘర్షణకు అవసరమైన వివాదాన్ని చూపించడం వంటి విషయాల కోసం ఎక్కువ సమయం తీసుకున్నా. ఇద్దరు స్టార్ హీరోలు కలిసి చేసిన సినిమా కావడంతో ఇది నిజమైన ఇండియన్ సినిమా కానుంది. ఈ సినిమాపై అభిమానులు ఏవిధమైన అంచనాలు పెట్టుకున్నారో నాకు తెలుసు. థియేటర్లలో కూర్చున్నప్పుడు వారికి జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతిని ఇచ్చేందుకు ప్రతి సెకన్ పనిచేస్తున్నా" అని అయాన్ ముఖర్జీ తెలిపారు.

యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న స్పై యూనివర్స్‌లో భాగంగా వస్తున్న ఆరో చిత్రమిది. 2019లో విడుదలైన 'వార్'కు కొనసాగింపుగా ఇది రూపొందుతోంది. కియారా అద్వానీ కథానాయిక. ఆగస్టు 14న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఎన్టీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని చిత్రబృందం ఇటీవల 'వార్ 2' టీజర్ విడుదల చేసిన విషయం తెలిసిందే. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ఢీ అంటే ఢీ అన్నట్టుగా తలపడే సన్నివేశాలు, యాక్షన్ హంగామా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



## మెగా ఫోన్ పట్టనున్న కాజల్

నటి కాజల్ అగర్వాల్ మెగా ఫోన్ పట్టనున్నారు. కెరీర్ పీక్స్ ఉన్నప్పుడే తన చిరకాల మిత్రుడు గౌతమ్ కిచ్లుని పెళ్లాడేసి, వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన ఈ అందాల చందమామ.. 'భగవంత్ కేసరి'తో సెకండ్ ఇన్నింగ్స్ మొదలపెట్టారు. ఆ సినిమా ఘన విజయం సాధించినా ఆ క్రెడిట్ అంతా బాలకృష్ణ, అనిల్ రావిపూడిల ఖాతాలో పడిపోవడంతో కాజల్‌కి మాత్రం ఆ స్థాయి అవకాశం మళ్లీ రాలేదు.

ఈ నెలలోనే ఆమె పార్వతీదేవి పాత్రలో నటించిన 'కన్నప్ప' చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే రెండు దశాబ్దాల తన అనుభవాన్నంతా క్రోడీకరించి, ఓ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో నిర్మించేందుకు కాజల్ సిద్ధమయ్యారని బీటౌన్ టాక్. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికార ప్రకటన విడుదల కానుంది.



## అందులో బస చేయడం మరింత ప్రత్యేకంగా అనిపించింది

టాలీవుడ్ ముద్దుగుమ్మ నటి మెహ్రీన్ తరచూ సోషల్ మీడియాలో ఏదో ఒక పోస్ట్‌తో ప్రత్యక్షమవుతుంటుంది. డిఫరెంట్ డిఫరెంట్ ఫొటోషూట్లు చేస్తూ అభిమానుల్ని అలరిస్తుంటుంది. అయితే తాజాగా ఈ హీరోయిన్ ఓ హెూటల్‌కెళ్లిన అనుభవాన్ని పంచుకుంది. అందుకు సంబంధించిన ఫొటోలు పంచుకుని.. "ఎస్ప్లానేడ్ హెూటల్ జాగ్రెబ్ నిజంగా నాకు ఇష్టమైన హెూటళ్లలో ఒకటిగా మారింది.

100 సంవత్సరాల అకాల సౌందర్యాన్ని జరుపుకునే ఈ ఐకానిక్ హెూటల్ ప్రారంభం నుండి ముగింపు వరకు మరపురాని అనుభవాన్ని అందిస్తుంది. వారి మిచెలిన్-లిస్ట్ చేసిన లె బిస్ట్రోలోని అద్భుతమైన భోజనం నన్ను ప్రత్యేకంగా ఆకట్టుకుంది వారి అక్కడ బస చేయడం మరింత ప్రత్యేకంగా అనిపించింది.నాకు మొత్తం అనుభవం కూడా పూర్తిగా నచ్చింది' అంటూ మెహ్రీన్ సోషల్ మీడియా పోస్ట్ ద్వారా వెల్లడించింది.

ఇకపోతే ఈ బ్యూటీ మెహ్రీన్ కౌర్ పిర్జాదా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. కృష్ణ గాడి వీర ప్రేమ గాథ చిత్రంతో తెలుగు సినిమారంగంలోకి తెరంగేట్రం చేసింది. ఈ మూవీలో నేచురల్ స్టార్ నాని సరసన కథానాయికగా నటించింది తెలుగు ప్రేక్షకుల మెప్పు పొందింది నటి మెహ్రీన్.

ఈ మూవీకి హను రాఘవపూడి దర్శకత్వం వహించాడు. 2017 లో ఫిలౌరీ అనే హిందీ సినిమాతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టి.. అక్కడ కూడా తన సత్తా చాటింది. తర్వాత మెహ్రీన్ మరిన్ని సినిమాల్లో అవకాశం దక్కించుకుంది .

## కమెడియన్ దర్శకత్వంలో సూర్య సినిమా..



కెరీర్ పరంగా సరైన విజయం అందుకోవడం కోసం ఎంతగానో శ్రమిస్తున్నారు నటుడు సూర్య . ఆయన హీరోగా కోలీవుడ్ హాస్య నటుడు ఆర్జే బాలాజీ కొత్త సినిమా రూపొందిస్తోన్న విషయం తెలిసిందే. సూర్య 45గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను చిత్రబృందం ప్రకటించింది. 'కరుప్పు' అనే పేరు ఫిక్స్ చేసినట్లు తెలిపింది. టైటిల్ పోస్టర్ షేర్ చేసిన సూర్య దర్శకుడికి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారు.

డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న మూవీకి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఫాంటసీ యాక్షన్ మూవీగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు కోలీవుడ్‌లో టాక్. దాదాపు ఏడాదికి పైగా స్క్రిప్ట్‌పై కసరత్తులు చేసినట్లు చిత్ర యూనిట్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. రేడియో జాకీగా కెరీర్‌ను ప్రారంభించిన బాలాజీ మల్టీ టాలెంటెడ్. నటుడు, గాయకుడు మాత్రమే కాదు, దర్శకుడిగానూ తన సత్తా చాటారు. నయనతార కీలక పాత్రలో ఆయన రూపొందించిన 'అమ్మోరు తల్లి' మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత 'వీట్ల విశేషం' అంటూ సత్యరాజ్‌తో ఓ మూవీ తీసి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి హీరో సూర్యతోనే మూవీ చేస్తున్నారు.

Printed, Published and owned by --------------------, Printed at --------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com